ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

నాదెండ్ల తనిఖీలతో హడల్‌!

రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ కొవ్వూరు మండలం కాపవరంలో ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి తొలి ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించేందుకు బుధవారం సాయంత్రం వచ్చారు. ఆ కార్యక్రమం అనంతరం విజయవాడ కారులో బయలుదేరుతూ ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించేశారు. రాత్రి వేళ మొదలైన ఈ ఆకస్మిక దాడులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఊహించని విధంగా జరిగిన ఈ ఆకస్మిక తనిఖీలతో అధికారులంతా పరుగులు పెట్టారు. రేషన్‌ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలించి విదేశాలకు ఎగుమతి చేస్తున్న రైస్‌ మిల్లుల లక్ష్యంగా ఈ తనిఖీలు సాగాయి. ఇందులో భాగంగా తొలుత నల్లజర్ల మండలంలో రెండు రైస్‌ మిల్లుల్లోనూ, తర్వాత దేవరపల్లిలో మరో రైస్‌మిల్లులోనూ తనిఖీలు చేశారు. మళ్లీ నల్లజర్ల సమీపంలో రహదారిలో లారీలను సైతం ఆపి తనిఖీలు చేశారు. అక్రమాలకు పాల్పడిన రైస్‌ మిల్లులను సీజ్‌ చేయించి విజయవాడ తిరిగి వెళ్లారు.

- మంత్రి మనోహర్‌ ఆకస్మిక తనిఖీలు
- నల్లజర్లలో భారీగా రేషన్‌ బియ్యం పట్టివేత
- దేవరపల్లి, నల్లజర్లలోని రైస్‌మిల్లుల్లో దాడులు
- 50 వేల మెట్రిక్‌ టన్నుల బియ్యం సీజ్‌
- కేసులు నమోదు చేస్తాం : మంత్రి మనోహర్‌



నల్లజర్లలో రైస్‌మిల్లులో మంత్రి తనిఖీలు.. ప్యాకింగ్‌ సంచులు

నల్లజర్ల, అక్టోబరు 9 : పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ పలు రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేసి భారీస్థాయిలో రేషన్‌ బియ్యం సీజ్‌ చేయించారు. బుధవారం కొవ్వూరు మండలం కాపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి తిరిగి విజయవాడ వెళుతున్న మంత్రి మనోహర్‌ నల్లజర్లలోని శ్రీ వెంకట సత్య రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేశారు. పౌర సరఫరాల అధికారులు, పోలీసులు వెంట వచ్చి రేషన్‌ బియ్యం పరిశీలించి అక్రమంగా విదేశాలు తరలించేందుకు సిద్ధంచేసిన రేషన్‌ బియ్యంగా గుర్తించారు. సుమారు 50 వేల మెట్రిక్‌ టన్నులు ఉంటుందని, ఈ సరుకు కాకినాడ వెళ్లి అక్కడ నుంచి ఆఫ్రికా దేశాలు వెళుతున్నట్టు మంత్రి మనోహర్‌ చెప్పారు. పేదలకు అందాల్సిన బియ్యం ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని, ప్రభుత్వం కిలో రూ.43.40కు కొనుగోలుచేసి ఉచితంగా అందిస్తోందని, కొందరు వ్యాపారులు ప్రజల వద్ద కిలో రూ.10కు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ దందాలకు పాల్పడి అక్రమంగా కోట్లు సంపాదించారని ఆరోపించారు. రాష్ట్రంలో అక్రమ రేషన్‌ బియ్యం కొనుగోలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ వ్యాపారుల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బియ్యం అక్రమ రవాణా నివారించే మంచి ఆలోచనతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం అనంతపల్లిలో వెంకట సత్యనారాయణ రైస్‌మిల్లుకు వెళ్లి తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు లేవని, విచారించాలని అధికారులకు సూచించారు. అక్కడ నుంచి దేవరపల్లిలో వెంకటేశ్వరా, వరలక్ష్మి రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. వెంకటేశ్వరా రైస్‌మిల్లులో గతంలో వేరొకచోట సీజ్‌ చేసి తెచ్చిన 60 బస్తాలు ఉండడంతో యాజమానిని ప్రశ్నించారు. సివిల్‌ సప్లై అధికారులకు తీసుకుని వెళ్లమని చెప్పినా పట్టించుకోలేదని యజమాని చెప్పడంతో అధికారులకు చివాట్లు పెట్టారు. వరలక్ష్మి రైస్‌మిల్లులో సీజ్‌ చేసిన బియ్యం 270 కిలోలు లేకపోవడంతో కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత రాత్రి 11 గంటల సమయంలో మంత్రి మనోహర్‌ అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద సరుకుతో వెళుతున్న లారీలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అక్రమ రేషన్‌ బియ్యం లారీలో తరలిపోతుందనే అనుమానంతో రైస్‌మిల్లులతోపాటు వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఉదయం పది గంటలకు తూర్పుగోదావరి జిల్లా కాపవరం ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన మంత్రి రాత్రి 11 గంటల వరకు రేషన్‌ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రైస్‌మిల్లులు, వాహనాల తనిఖీలో సమయం అంతా గడిపారు. మంత్రి ఏ గ్రామం వెళ్లినా జనసైకులతోపాటు టీడీపీ నాయకులు అంతా ఆయనతో సెల్ఫీల కోసం క్యూ కట్టారు.



దేవరపల్లిలోని ఓ రైస్‌మిల్లులో బుధవారం రాత్రి బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న మంత్రి మనోహర్‌

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్‌



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి మనోహర్‌

కొవ్వూరు, అక్టోబరు9: రైతులకు భరోసా కల్పించి అండగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుఖాతాకు సొమ్ము జమచేసి చూపిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి మనోహర్‌తో పాటు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ ప్రారంభించారు. రైతుసేవా కేంద్రం పరిసరాల్లో మొక్కలు నాటారు. తొలుత కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి తప్పులు జరగకుండా రైతు సంఘం నుంచి ఒకరు, మిల్లర్ల నుంచి ఒకరు కలిసి క్షేత్రస్థాయి కమిటీలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. 17 శాతం నుంచి 22 శాతం వరకు తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 220 రైతు సేవా కేంద్రాల ద్వారా 2 లక్షల 30 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించామని, ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు 3 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తోపాటు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, దిసభ్య కమిటీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

17 ఓపెన్‌ ర్యాంపులకు 145 దరఖాస్తులు

జేసీ ఎస్‌.చిన్నరాముడు

రాజమహేంద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత ఇసుకను మరింతగా అందుబాటులోకి తేవడంకోసం 17 ఓపెన్‌ రీచ్‌లకు టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. బుధవారం సాయంత్రంతో గడువు ముగియడంతో దరఖాస్తు చేయడానికి ఇసుక వ్యాపారులు అధికంగా తరలివచ్చారు. బుధవారం రాత్రి వరకూ వీటిని స్వీకరించారు. మొత్తం 145 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.చిన్నరాముడు తెలిపారు. వీటిని గురువారం పరిశీలించి, జిల్లా ఇసుక కమిటీ ముందు పెట్టి, అర్హత ఉన్న వాటిని ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలో కడియం, సీతానగరం, రాజమండ్రి రూరల్‌, కొవ్వూరు, తాళ్లపూడి, పెరవలి, నిడదవోలు మండలాల పరిధిలో 17 ఇసుక ఓపెన్‌ ర్యాంపులను గుర్తించారు. ఈనెల 16 నుంచి వీటిని అమలులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నారు. ఓపెన్‌ ర్యాంపులన్నీ అమలులోకి వస్తే, ఇసుక బాగా అందుబాటులోకి వస్తుంది.

కలెక్టరేట్‌లో ఇసుక టెండర్ల రగడ?

రాజమహేంద్రవరం సిటీ/రూరల్‌, అక్టోబరు 9: రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం ఇసుక ఓపెన్‌ రీచ్‌లకు సంబంధించిన టెండర్లు దాఖలు చేయడానికి వచ్చినవారు వారిలో వారు గొడవపడినట్టు తెలిసింది. టెండర్ల ప్రక్రియకు బుధవారం ఆఖరు తేదీ కావడంతో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి టెండర్‌ వేసేందుకు చాలామంది కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సాయంత్రం 5.55కు కొంతమంది టెండర్‌కోసం రాగా, వారితో అప్పటికే అక్కడ ఉన్నవారు గొడవ పడడంతో కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో కొంతమందికి చాన్స్‌ దక్కలేదు. టెండర్ల ప్రక్రియలో కొంతమంది కావాలనే టెండర్‌ వేసేవారిని అడ్డుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ నుంచి వచ్చిన ముగ్గురు మిగిలిన వారిని టెండర్లు వేయనివ్వలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



స్వర్ణాంధ్ర -2047 కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్‌



సమావేశంలో మాట్లాడుతున్న పి. ప్రశాంతి, గోరంట్ల, ఆదిరెడ్డి

ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర @2047

- పేదరికాన్ని పారద్రోలేలా ప్రణాళికలు సిద్ధంకావాలి
- 2047 ప్రణాళికతోపాటు 2024-2029 జిల్లా విజన్‌ ప్లాన్‌ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్‌

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు9: ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర@2047 ప్రణాళికలు రూపకల్పన చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో బుధవారం వికసిత్‌ భారత్‌, స్వర్ణాంధ్ర@2047, 2024-25 టూ 2028-2029 జిల్లా విజన్‌ ప్లాన్‌పై ప్రముఖుల సలహాలు, సూచనలకోసం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దీనికి మంత్రితోపాటు జిల్లా కలెక్టర్‌ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం రూరల్‌, సిటీ, రాజానగరం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్‌, బత్తుల బలరామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌ మాట్లాడుతూ దేశ, రాష్ట్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించేటప్పుడు క్షేత్రస్థాయి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఆ దిశగా వివిధ రంగాలకు సంబంధించి దేశస్థాయిలో వికసిత్‌ భారత్‌, రాష్ట్రస్థాయిలో స్వర్ణాంధ్ర@2047 రూపకల్పనకు అవసరమైన ప్రణాళికలను రూపొందించే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వికసిత్‌ భారత్‌, స్వర్ణాంధ్ర @2047 పేరుతో నవంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా విజన్‌పత్రం రూపకల్పన దిశగా క్షేత్రస్థాయిలో పరిగణలోకి తీసుకున్న అంశాలపై జిల్లా స్థాయిలో సమీక్షించి రాష్ట్రానికి పంపడం జరుగుతుందన్నారు. విజనరీ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని, ఆయన విజన్‌-2020 రూపకల్పన చేసి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ నేతృత్వంలో ప్రభుత్వం ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, గత గ్రామసభల్లో క్షేత్రస్థాయిలో నిర్ణయించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టడం జరుగుతుందన్నారు. 2047నాటికి 15 శాతం వృద్ధిరేటు సాధించాలన్నారు. రానున్న ఐదేళ్లలో ఏయే అంశాలపై లక్ష్యసాధన చేయాలనేది ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధంచేయాలన్నారు. కలెక్టర్‌ ప్రశాంతి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర@2047 విధి విధానాల మేరకు మండలస్థాయిలో కార్యక్రమాలను క్రోడీకరించుకొని జిల్లాస్థాయిలో ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. సహజ వనరులను, మానవ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలు అభివృద్ధి లక్ష్యంగా అన్ని రంగాల్లో క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం కావాలన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్య, వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తమ సలహాలు ఇచ్చారు.

రేపు సాయంత్రం 7 వరకూ మద్యం దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీకి సంబంధించి షాపుల కేటాయింపునకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించిందని ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ లావణ్య తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 11వ తేదీ సాయంత్రం 7గంటల వరకూ ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. 12, 13న శాఖాపరమైన ప్రక్రియ ఉంటుందని, 14న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. బుధవారం రాత్రి 7.30గంటల సమయానికి జిల్లాలో మొత్తం 2,800 దరఖాస్తులు అందాయన్నారు. కాగా.. జిల్లాలో 125 షాపులను నోటిఫై చేయగా లక్ష్యం 3750 దరఖాస్తులు కావడం గమనార్హం. గడువు పొడిగింపుతో 12న తెరుచుకోవాల్సిన ప్రైవేటు మద్యం షాపులు 15 నుంచి అందుబాటులోకి రానున్నాయి.

రాష్ట్రంలో బ్యాంక్‌ను నెంబర్‌వన్‌ చేయడమే లక్ష్యం

ఆర్యాపురం బ్యాంక్‌ చైర్మన్‌ చల్లా శంకర్రావు



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా శంకర్రావు

రాజమహేంద్రవరం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఆర్యాపురం కోపరేటివ్‌ అర్బన్‌ బ్యాంక్‌ను రాష్ట్రంలో నెంబర్‌వన్‌ చేయడమే లక్ష్యమని, గత ఐదేళ్లలో వైసీపీ ఆధ్వర్యంలో పనిచేసిన నామినేటెడ్‌ పాలకవర్గం బ్యాంక్‌ను దివాళా వైపు నడిపించిందని, డిపాజిట్ల సేకరణ లేదని, అప్పులు కూడా వసూలు చేయలేదని, అవకతవకలకు పాల్పడిందని ఆర్యాపురం కోపరేటివ్‌ అర్బన్‌ బ్యాంక్‌ చైర్మన్‌ చల్లా శంకర్రావు తెలిపారు. రాజమహేంద్రవరం బ్యాంక్‌ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్‌ డిపాజిట్లు రూ.1000కోట్లకు, రుణాలు రూ.750కోట్ల వరకూ ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత పాలకవర్గం నిర్వాకం వల్ల 7శాతం ఉండాల్సిన ఎన్‌పీఏను 20 శాతానికి చేసేయడంతో రిజర్వుబ్యాంక్‌ ఈ బ్యాంక్‌ను సూపర్‌వైజరీ యాక్షన్‌ ఫ్రేమ్‌ వర్కులో పెట్టడంవల్ల నాలుగేళ్లుగా సభ్యులకు డివిడెండ్లు ఇవ్వడం లేదన్నారు. ఈ బ్యాంక్‌ను సిక్‌అండ్‌వీక్‌ బ్యాంక్‌గా రిజర్వు బ్యాంక్‌ పరిగణించడంవల్ల జూలై 23వతేదీకి ఎన్‌పీఏ 22శాతం, నెట్‌ ఎన్‌పీఏ 12.84శాతంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ బ్యాంక్‌ను రిజర్వుబ్యాంక్‌ ఇంకా సూపర్‌వైజరీ యాక్షన్‌ ఫ్రేమ్‌వర్కు(శాప్‌)లో ఉంచిందన్నారు. కూటమి పాలకవర్గం వచ్చి 75రోజులు అయిందని, తాము లోన్లు రూ.35కోట్లకు పెంచామన్నారు. వైస్‌ చైర్మన్‌ పోలాకి పరమేష్‌ మాట్లాడుతూ గత పాలకవర్గంలో షాడో చైర్మన్‌గా వ్యవహరించిన ఒక వ్యక్తివల్ల బ్యాంక్‌ దెబ్బతిందన్నారు. డైరెక్టర్‌ యెనుమల రంగబాబు మాట్లాడుతూ గత నామినేటెడ్‌ బాడీ కొనుగోలు చేసిన గిఫ్ట్‌ల్లోను అవినీతికి పాల్పడిందని, తప్పుడు ఆరోపణలతో బ్యాంక్‌ సభ్యులను మానసిక క్షోభకు గురి చేయడం తప్ప ఏమీ చేయలేదన్నారు. సమావేశంలో నీలపాల సత్యనారాయణ, పిల్లి శ్యామ్‌, యాళ్ల కుమారస్వామి, బుడ్డిగ రవి, పడాల శ్రీనివాస్‌, సింగంపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



ఇలాగైతే ఎలా.. బాస్‌

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పోలీసింగ్‌ పట్టు తప్పుతున్నట్టు కనిపిస్తోంది. బాస్‌ సమర్థుడే అయినా సిబ్బంది హద్దులు మీరడం.. కేసులను తారుమారు చేయడం.. గంజాయి పల్లెలకూ పాకిన దౌర్భాగ్యం వెరసి జిల్లా పోలీసు శాఖపై ఆరోపణలు అలముకుంటున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో దాష్టీకాలు జరిగినా లాఠీ బయటకు తీయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతవరకు దాడులకు ఉపక్రమించారు. కానీ కొందరు వైసీపీ అనుకూల అధికారులు కూటమి ముసుగుతో పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బదిలీల ప్రక్రియకు ఇంకా ముగింపు పలికినట్టు లేదు. ఎప్పుడు ఎవరి సీటు కదులుతుందో ఇప్పటికీ ప్రశ్నగానే ఉంది. గంజాయి గ్రామాల్లోని పుట్టినరోజు వేడుకల్లో గుప్పుమనడం ఉలికిపాటుకు గురిచేస్తోంది. కొందరు అధికారుల్లో మితిమీరిన బాసిజం, ఓ అధికారి వద్దకు వెళ్లాలంటే మహిళా పీసీలు జంకే పరిస్థితి.. కొందరు పోలీసు అధికారుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- పోలీసుల్లో హద్దు మీరుతున్న బాసిజం
- సిబ్బందికి కొసరు పనులెక్కువ
- ఓ జోనల్‌ పోలీసు అధికారికి మరో జాఢ్యం
- గ్రామాల్లోని పుట్టిన రోజుల్లో గంజాయి
- కొవ్వూరు రిక్రియేషన్‌ క్లబ్‌పై అత్యుత్సాహం
- పెరవలి పేకాట కేసు ఏమైందో..

యూనిఫాం సర్వీసులో బాసిజానికి కొదువ ఉండదని అంటుంటారు. ఇప్పుడు జిల్లాలోని కొందరు అధికారుల తీరు చూస్తుంటే అదే నిజమనే పరిస్థితి. ఇటీవల ఓ హోంగార్డుపై జోనల్‌స్థాయి అధికారి బహిరంగంగా వర్షంలో నిలబెట్టి బండ బూతులతో రెచ్చిపోవడంతో సదరు హోంగార్డు ఆత్మహత్య చేసుకుంటానంటూ కన్నీళ్లు పెట్టుకోవడం తోటి ఉద్యోగులను కలచివేసింది. ఆ హోంగార్డు ఉద్యోగానికి సంబంధించిన నిర్లక్ష్యం అయితే పోనీలే అనుకోవచ్చు. కానీ ఆ అధికారి వ్యక్తిగత పనిలో సమాచారలోపం వల్ల జరిగిన పొరబాటుకు హద్దు మీరి చిందులు తొక్కడ శాఖలో చర్చనీయాంశమైంది. ఈ విషయం ఎస్పీకి విన్నవించడానికి వెళ్లగా హోంగార్డులకు బాధ్యత వహించే ఆర్‌ఐ సర్దిచెప్పి పంపేశారని తెలుస్తోంది. మహిళా సిబ్బంది విషయంలో ఆ అధికారి యూనిఫాంపై ఇప్పటికే పలు మరకలు ఉండడం గమనార్హం. విధులు నిర్వర్తించే వేళలు కూడా అందరికంటే భిన్నంగా ఉండడంతో ఆయన వద్ద పనిచేయడానికి పోలీసులు బెంబేలెత్తిపోతున్నారని సమాచారం. ఆయన ఇక్కడికి వచ్చిన ఏడాదికే ఆరుగురు డ్రైవర్లు మారారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కొసరు పనులెక్కువ

జిల్లాలోని హోంగార్డు నుంచి ఏఎస్‌ఐ స్థాయి వరకూ సిబ్బందికి అసలు పనులకంటే కొసరు పనులు ఎక్కువైపోయాయనే విమర్శలున్నాయి. జిల్లాలోని ఆ స్థాయిలో సుమారు 1200 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో సెలవు, సిక్‌ లీవ్‌, అనుమతుల రూపంలో ఉద్యోగానికి రాని వారిని, బందోబస్తులు, వీఐపీ బందోబస్తులు, కోర్టులు ఇలా రకరకాల రూపాల్లోని వాళ్లను తీసేస్తే ప్రతిరోజూ శాంతిభద్రతల నిర్వహణకు ఓ 600 మంది అందుబాటులో ఉంటారు. వీళ్లలో అధికారుల ఇళ్ల వద్ద, వ్యక్తిగత పనులకు 100 మంది వరకూ వెళ్లిపోతారు. మిగతావారు స్టేషన్లలోనే పనిచేస్తారా.. దర్యాప్తులే చూసుకుంటారా.. నేరస్తులనే పట్టుకుంటారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రాఫిక్‌ విభాగంలో సిబ్బందికంటే టీట్లే ఎక్కువగా ఉండడం గమనార్హం. ఇక హోంగార్డులు, కానిస్టేబుళ్ల దుస్థితి మరీ దారుణంగా తయారైంది. అధికారులు ఎవరూ కూడా సిబ్బందిని వ్యక్తిగత పనులకు వినియోగించుకోడానికి వీల్లేదు. ఎస్పీ స్థాయి అధికారులకు కాస్త మినహాయింపు ఉంటుంది. అయితే డీఎస్పీ స్థాయి నుంచి సీఐ వరకూ కొందరు ఎస్‌ఐలు కూడా తమ వ్యక్తిగత డ్రైవర్లుగా, ఇంట్లో సరుకులు తెచ్చే వారిగా సిబ్బందిని వాడేస్తున్నారు. మహిళా హోంగార్డులను అయితే కొందరు అధికారుల ఇళ్లలో పాచి పనులు చేసే వారికంటే దారుణంగా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. అటు ట్రైనింగ్‌ పూర్తి చేసుకొచ్చిన యువతకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విధులను కాకుండా కంప్యూటర్ల దగ్గర, ఆఫీస్‌ వర్కుకు కేటాయించడం గమనార్హం. దీనివల్ల జిల్లాలో చాలామంది పోలీసులు ఉన్నట్టు లెక్కల్లో చూపెడుతున్నా పోలీస్‌ విధులు నిర్వర్తించేవారు మాత్రం ఆ స్థాయిలో కానరావడం లేదు. ఇదే అంశంపై ఇటీవల హోంమంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో కూడా చర్చకు వచ్చింది.

అత్యుత్సాహమేనా!

పలువురు పోలీసుల అత్యుత్సాహం శాఖకు చెడ్డ పేరు తీసుకొచ్చేవిధంగా ఉంటోందని అంటున్నారు. కొవ్వూరు రిక్రియేషన్‌ క్లబ్‌ సంఘటనే తాజా ఉదాహరణ. పోలీసులు రాత్రివేళ ఆ క్లబ్‌పై దాడి చేశారు. అప్పటికే అక్కడ పేకాట ఆడుతున్న సుమారు 30 మంది పోలీసుల హడావుడి చూసి కంగారు పడిపోయారు. దొరికిన దారిలో పారిపోయే ప్రయత్నంలో మొదటి అంతస్తు నుంచి కిందికి పడిపోయారు. ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో వీధిలో పేకాట శిబిరం, రోడ్డుకో బెల్టుషాపు, బ్లేడ్‌ బ్యాచ్‌ల హల్‌చల్‌ వంటివి ఉన్నా ఎందుకనో దాడులు గుర్తుకు రాలేదు. పైగా కొవ్వూరులో దాడి చేసింది పేకాట శిబిరంపై కాదు. క్లబ్‌పై దాడి చేసే ముందు అనుమతులను పరిశీలించి నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాల్సి ఉండాల్సిందనే అభిప్రాయం ఉంది. అప్పటికీ శ్రుతి మించితే కఠిన చర్యలు తీసుకోవడం సబబే. కానీ క్లబ్‌ని అనుమతుల మేరకే నిర్వహిస్తున్నామని, సీసీ కెమెరాలను ఏర్పాటుచేశామని నిర్వాహకులు చెప్పినా వినలేదని సమాచారం. ఇదే సబ్‌ డివిజన్‌ పరిధిలోని నిడదవోలు పోలీస్‌స్టేషను పరిధిలోకి వచ్చే పెరవలి మండలం ముక్కామలలో గత నెల 8న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన సమయంలో సుమారు 30 మందిని, రూ.8 లక్షలు స్వాధీనం చేసుకొని చివరికి రూ.6 లక్షలు తప్పించి, 25 మందిని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించినట్టు తెలిసింది.

బదిలీలకు ముగింపు లేదా?

జిల్లాలోని కిందిస్థాయి సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్‌ ఇటీవల బదిలీ చేశారు. కానీ సీఐల బదిలీల తంతు మాత్రం అంతం కాదిది.. ఆరంభం అనే చందంగా సాగుతోంది. వైసీపీకి అనుకూలమైన వాళ్లు సందేట్లో నడేమియా మాదిరిగా మళ్లీ మంచి పోస్టింగులు దక్కించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆ ప్రభుత్వంలో వివక్షకు గురైన వారికి ఈ ప్రభుత్వంలోనూ మేలు జరగలేదనే ఆవేదన కొందరిలో ఉంది. వైసీపీ దాష్టీకాలకు తలవంచలేక లాప్‌లైనులో చేసిన వారిని మళ్లీ లూప్‌ లైనుకు లేదా వీఆర్‌కి పంపించారు. జిల్లా వీఆర్‌లో ఉన్న సిబ్బందిని ఎప్పుడు ఏ స్టేషనుకు పంపిస్తారో.. ఎవరిని ఎప్పుడు వీఆర్‌లో పెడతారో తెలియని పరిస్థితి నడుస్తోంది. ట్రై చేసుకుంటే ఏ సీటు అయినా సాధ్యమే అనే చందంగా రోజులు గడుస్తున్నాయి. దీంతో డబ్బు ఖర్చు పెట్టుకుని పోస్టింగులు పట్టుకున్న వాళ్లకూ సీటు గ్యారంటీ లేదు. మరోవైపు అనపర్తి సీఐ శివగణేశ్‌ని అకస్మాత్తుగా వీఆర్‌కి పంపించారు. ఆయన స్థానంలో సంపత్‌ హుటాహుటిన వచ్చి జాయిన్‌ అయిపోయారు. ఈయన గతంలో ఇదే స్టేషనులో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది. దాంతో స్థానిక పరిచయాలే ఆయనకు లాభించినట్టు సమాచారం. గతంలో తీవ్ర ఆరోపణలు ఉన్న అధికారులను జిల్లా లేదా రేంజ్‌ వీఆర్‌లో పెట్టడం జరిగేది. కానీ ఇప్పుడు చిటికెలో వీఆర్‌లో పెడుతున్నారు. దీంతో సామాన్యుల భద్రతకు ఆయా అధికారులు ఎంత వరకూ భరోసా కల్పిస్తారో.. శాంతి భద్రతలను ఏ మేరకు కాపాడతారో వేచి చూడాల్సిందేననే వాదన నడుస్తోంది.

గంజాయి కలకలం

గంజాయిని ఉక్కుపాదంతో నిర్మూలిస్తామని కూటమి పాలకులు చెబుతుంటే జిల్లాలో పరిస్థితి మాత్రం ఆ మాటలను వెక్కిరిస్తున్నట్టు కనిపిస్తోంది. గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ఏకంగా ఒక టాస్క్‌ఫోర్స్‌ని అందుబాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పింది. దానికి బాస్‌ని కూడా నియమించింది. అయితే సిటీల్లోని బర్త్‌డే వంటి పార్టీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగడం వింటూనే ఉంటాం. కానీ ఇప్పుడు చిన్న గ్రామంలోని జన్మదిన వేడుకల్లో కుర్రాళ్లు గంజాయితో ఎంజాయ్‌ చేశారనే వార్త స్థానికంగా చర్చనీయాంశమైంది. భూపాలపట్నం గ్రామంలో పుట్టినరోజు వేడుకల్లో యువకులు డ్రగ్స్‌ సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు వెంటనే వెళ్లారు. కారులో కొందరు గంజాయి కొడుతుండడం గుర్తించారు.



భూపాలపట్నంలో పార్టీ జరిగిన గెస్ట్‌హౌస్‌

భూపాలపట్నంలో డ్రగ్స్‌ కలకలం

- పోలీసుల అదుపులో నిందితులు
- పుట్టినరోజు వేడుకలో మాదక ద్రవ్యాలు వినియోగం
- రహస్య దర్యాప్తు చేస్తున్న రాజానగరం పోలీసులు
- ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన - 6లో

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌ టోర్నీ విజేత చిత్తూరు

గుర్తు తెలియని వాహనం ఢీకొని పారా లీగల్‌ వలంటీర్‌ మృతి

- 6లో

సరస్వతీ దేవిగా...



'లోవ'లో తలుపులమ్మ అమ్మవారు

ప్రసిద్ధ పుణ్య క్షేత్రం లోవ దేవస్థానంలో అమ్మవారు శ్రీసరస్వతీ దేవిగా అనుగ్రహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులతో పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- తుని రూరల్



రత్నగిరిపై వనదుర్గ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ బుధవారం సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వీణాపాణియై విద్యాబుద్ధులు ప్రసాదించే దేవిగా అనుగ్రహించారు. మూల నక్షత్రం సందర్భంగా కనకదుర్గ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు.
- అన్నవరం



కొబ్బరి బొండంపై కనకదుర్గమ్మ

ఫ్రూట్ కార్వింగ్ ద్వారా కొబ్బరి బొండంపై కనకదుర్గ అమ్మవారిని చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. దేవీ శరన్న వరాత్రుల సందర్భంగా తనకు ప్రావీణ్యమున్న కళ ద్వారా అమ్మవారిని చెక్కి, విజయదశమి విశిష్టతను గ్రామస్తులకు వివరించారు.
- గొల్లప్రోలు





త్రికోటి సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు, సరస్వతీ దేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

శ్రీపీఠంలో వైభవంగా త్రికోటి సరస్వతి పూజ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 9: కాకినాడ శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో త్రికోటి సరస్వతి పూజను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మహాశక్తి యాగం బుధవారం ఏడో రోజుకు చేరుకుంది. స్వామీజీ మాట్లాడుతూ మనకు మేధస్సు, ప్రజ్ఞ, జ్ఞానం ఇవ్వడంతో పాటు వాటిని ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉపయోగించాలో నేర్పే తెలివితేటలను సరస్వతిదేవి అనుగ్రహిస్తుందన్నారు. భగవంతుడిని గాడ్‌గా పిలుస్తామని.... జీ అంటే జనరేటర్ బ్రహ్మ అని, ఓ అంటే ఆర్గనైజర్ బ్రహ్మ చేసిన పనిని సక్రమంగా పూర్తి చేసేది విష్ణువని... డి అంటే డిసాల్వర్, బ్రహ్మ, విష్ణువు చేసిన పనులన్నింటినీ ఆవలోకనం చేసి సృష్టి, స్థితి, లయకారకుడిగా శివుడు ఉన్నారన్నారు. సుమారు 30వేల మంది విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కవి, సినీ గేయ రచయిత, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అతిథిగా హాజరయ్యారు. 200 మంది విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూల నక్షత్రం సందర్భంగా వేద పండితులు విశేష పూజలు, శతకోటి కుంకుమార్చన, లలితా రహస్య సహస్రనామ పారాయణ చేశారు. సుమారు 30వేలకు పైగా మాతృ మూర్తులు పాల్గొన్నారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ట్రాఫిక్ సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, హెచ్‌సీ, కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పోటీ

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

కాకినాడ సిటీ, అక్టోబరు 9: త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పోటీ చేస్తుందని, అభ్యర్థి ఎంపికపై కసరత్తు జరుగుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కూటమి ఎమ్మెల్యేలు, నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యనమల మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాధ్యత వహించి పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించామన్నారు. ఈ బాధ్యతను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పట్టభద్రుల ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల ఈ దఫా గణనీయంగా పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు.

గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని, దాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అనేక రకాల అవస్థలు పడుతోందని యనమల తెలిపారు. సమస్యలు అధికంగా ఉన్నా హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు రావాలని, అవి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజలు అర్థం చేసుకుని అంతవరకు ఓపిక పట్టాలన్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందుండాలనే ధ్యేయంతో తమ ప్రభుత్వం పయనిస్తోందన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అరాచకం, అవినీతివల్ల అభివృద్ధిలో వెనుకపడడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణుడు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

అందువల్లే వేగంగా అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నారన్నారు. అందరం కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థిని ఎంపిక చేస్తామన్నారు.

సమావేశంలో ఎమ్మెల్సీ పరిశీలకుడు భూమిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు, పంతం నానాజీ, అయితాబత్తుల ఆనందరావు, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప, మిరియాల శిరీషదేవి, వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, టీడీపీ పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, పెందుర్తి వెంకటేష్, చిక్కాల రామచంద్రరావు, నేతలు నురుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మోకా ఆనందసాగర్, పెంకే శ్రీనివాసబాబా, కటకంశెట్టి బాబీ, జనసేన నేతలు మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మల బాబు, వరుపుల తమ్మయ్యబాబు, బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



నమూనా దస్తావేజును ఈవోకు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, దాత ఆదిమూర్తి దంపతులు

బాలాత్రిపురసుందరి ఆలయానికి
అర ఎకరం భూదానం

కాకినాడ సిటీ, అక్టోబరు 9: కాకినాడలోని శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయానికి కాకినాడకు చెందిన రెడ్డి ఆదిమూర్తి దంపతులు జగ్గంపేట మండలం కాండ్రేగులలో రూ.35లక్షలు విలువైన భూమిని దానంగా ఇచ్చారు. ఈ భూమి దస్తావేజును బుధవారం ఆలయంలో దాత కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుతో కలిసి ఈవోకు అందజేశారు. దాతకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు పాల్గొన్నారు.



అమ్మవారికి చీర సమర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

జ్ఞాన సరస్వతి అమ్మవారికి మూడు కిలోల
వెండి చీర బహూకరణ



రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారికి వైద్యుడు డాక్టర్ సునీల్‌కుమార్ మూడు కిలోలతో వెండి చీర చేయించారు. బుధవారం దానిని ఆలయ ఈవో శ్రీనివాస్‌కు అందజేశారు. తొలుత ఆయన అమ్మవారికి పూజలు జరిపారు. కోళ్ల రవికుమార్, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూపాలపట్నంలో
డ్రగ్స్ కలకలం

- » పోలీసుల అదుపులో నిందితులు
- » పుట్టినరోజు వేడుకలో మాదక ద్రవ్యాలు వినియోగం
- » రహస్యంగా దర్యాప్తు చేస్తున్న రాజానగరం పోలీసులు
- » ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన





పుట్టినరోజు వేడుక జరిగిన గెస్ట్ హౌస్, డ్రగ్స్‌తో దొరికిన కారు

రాజానగరం, అక్టోబరు 9: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం సమీపంలోని ఓ గెస్ట్‌హౌస్‌లో పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని కొంతమంది యువకులు డ్రగ్స్ సేవిస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తాడేపల్లిగూడెం, హైదరాబాద్, వైజాగ్ ప్రాంతాలకు చెందిన కొంతమంది యువకులు ఈనెల 7వ తేదీ రాత్రి ఈ గెస్ట్‌హౌస్‌లో పుట్టినరోజు వేడుకల్లో మాదక ద్రవ్యాలు సేవిస్తున్నారన్న సమాచార అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, అనుమానిత యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టుగా తెలిసింది. దీనిలో ప్రధానంగా తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడు గత కొంతకాలంగా దివాన్‌చెరువులో నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి మారుమూల ప్రాంతమైన భూపాలపట్నం శివారులోని ఒక గెస్ట్‌హౌస్‌ను ఎంచుకుని పుట్టినరోజు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. దీనిలో భాగంగా అధిక సంఖ్యలో యువత పాల్గొని పబ్ సంస్కృతిని తలపించేలా ఏర్పాట్లలో మునిగితేలినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. దీంతో పలువురు యువకులు, యువతులు అక్కడి నుంచి పరుగులు తీయగా, వీరిలో ముగ్గురు యువకులు మాత్రం పోలీసులకు చిక్కారు. వీరిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వీరు వచ్చిన కారును తనిఖీ చేయగా కారులో కొకైన్, గంజాయి పొట్లాలు తదితర మాదక ద్రవ్యాలు లభించినట్టు తెలిసింది. నిందితుల నుంచి పూర్తి వివరాలు రాబట్టేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ విషయమై సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌ను సంప్రదించగా.... విచారణ కొనసాగుతోందంటూ వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.





రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు, తృతీయ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జట్టు సభ్యులు

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత చిత్తూరు

దివాన్‌చెరువు, అక్టోబరు 9: క్రీడాకారులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ సూచించారు.తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మూడు రోజులు జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన విజయప్రకాష్ మాట్లాడుతూ క్రీడాకారులకు సాధనతో పాటు తీసుకునే ఆహారం విషయంలో కూడా ఎంతో జాగ్రత్త అవసరమన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ టోర్నీలో చిత్తూరు (ప్రథమ), శ్రీకాకుళం (ద్వితీయ), తూర్పు గోదావరి (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. రాష్ట్ర స్థాయి విజేతలు తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే స్వామి తెలిపారు. కార్యక్రమంలో డీవైఈవో నారాయణ, పరిశీలకుడు ఎంవీ నాగేంద్ర, శ్రీప్రకాష్ విద్యానికేతన్ మేనేజరు ఏఎస్ఎన్ మూర్తి, వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, కోశాధికారి వీరబాబు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

దివాన్‌చెరువు అక్టోబరు 9: రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 22 మంది క్రీడాకారులతో అండర్-17 బాలురు విభాగంలో హ్యాండ్‌బాల్ జాతీయ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో తెలంగాణలో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని చెప్పారు. అంతకు ముందు తూర్పు గోదావరి జిల్లాలోనే వీరికి శిక్షణ ఇస్తారన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన వారు జిల్లాల వారీగా... కె.తేజసాయిరెడ్డి, జి.తంగరాజ్, ఎం.యోగీశ్వర్, కె.చైతన్యకుమార్, ఆర్ఆర్ నాయక్ (చిత్తూరు), రాజనాల వేదాంత సాయి, తిన్ని దిల్లేశ్వరరావు, గొర్లె దిల్లేశ్వరరావు (శ్రీకాకుళం), కొల్లాబత్తుల సెల్విక్, అంగారపు వెంకటగణేష్, రావిపాటి శ్రీసత్యపవన్ (తూర్పు గోదావరి), ఎ.దేవసూర్యసాయి. వి.గౌరీశంకర్ (విశాఖపట్నం), పి.దేవిచరితసత్య (ప్రకాశం), పి.జశ్వంత్ (విజయనగరం), ఎం.ప్రసాద్‌నాయక్, జి.వినయ్ (కర్నూలు), దాసరి జాషువ (నెల్లూరు), మోపిదేవి తన్విస్ (కృష్ణా), అద్దంకి రాజ్‌పాల్ (గుంటూరు), ఎస్.ఆదిశేషారెడ్డి (కడప), సాయిమహేశ్వర్ (అనంతపురం)

తల్లిదండ్రులు మందలించారని
యువకుడి ఆత్మహత్య

గొల్లప్రోలు, అక్టోబరు 9: తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన విశ్వనాధుల శివ (25) తాపీ పని చేస్తాడు. ఏడాదిన్నర క్రితం పల్సర్ బైక్‌ను ఫైనాన్స్‌పై కొనుగోలు చేశాడు. అప్పుడప్పుడు వాయిదాలు కట్టకపోవడంతో అతడి తల్లి దుర్గ వాయిదాలు చెల్లించేది. వాయిదాలు కట్టకపోవడంతో 20 రోజుల క్రితం ఫైనాన్స్ ప్రతినిధులు వచ్చి బైక్ తీసుకుని వెళ్లిపోయారు. అతడి తల్లి మళ్లీ వాయిదాలు కట్టి విడిపించింది. పనికి కూడా సక్రమంగా వెళ్లట్లేదు. ఫైనాన్స్ ఎలా కడతావు అంటూ మంగళవారం సాయంత్రం శివను తల్లిదండ్రులు దుర్గ, జగ్గారావు మందలించారు. దీంతో మనస్తాపానికి గురయిన శివ రాత్రి సమయంలో ఎలుకలకు పెట్టే మాత్రలు వేసుకుని వాంతులు చేసుకుంటుండగా, స్నేహితుడు ఉమ గమనించి ఇంటికి తీసుకొచ్చాడు. కుటుంబసభ్యులు అతడిని తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బేబీ ప్రశాంతి (పాత చిత్రం)

గుర్తు తెలియని వాహనం ఢీకొని పారా లీగల్ వలంటీర్ మృతి

మరో మహిళకు గాయాలు

దివాన్‌చెరువు, అక్టోబరు 9: తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దివాన్‌చెరువులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక మహిళ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి బొమ్మూరు ఎస్ఐ ఎస్‌పీ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం అంబేడ్కర్ నగర్‌కు చెందిన పెనుగుల బేబీ ప్రశాంతి (41) పారా లీగల్ వలంటీర్‌గా పని చేస్తోంది. ఆమె జీఎస్ఎల్ ఉద్యోగి కె.సత్యవతితో కలిసి మోటారు సైకిలుపై రాజమహేంద్రవరం వైపు వెళ్తోంది. ఆటోనగర్ సమీపంలోని ఫ్రెండ్స్ దాబా వద్దకు చేరుకునే సరికి గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిలును ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావడంతో బేబీ ప్రశాంతి అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ సత్యవతిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

నిడదవోలు/చాగల్లు, అక్టోబరు 9: తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం దారవరం రైల్వే గేటు సమీపంలో ఒక మహిళ మృతదేహం లభ్యమైంది. రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారంతో వెళ్లి చూశారు. ఆమెను బ్రాహ్మణగూడేనికి చెందిన కొండేపాటి కుమారి (41)గా గుర్తించారు. మంగళవారం రాత్రి అత్తమామలతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయింది. దారవరం రైల్వే గేటు సమీపంలో వెళ్లే రైలుకిందపడి తీవ్ర గాయాలతో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నిడదవోలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు చెప్పారు.

బాలికపై అత్యాచారం కేసులో
ఇద్దరు నిందితుల అరెస్టు

పిఠాపురం, అక్టోబరు 9: కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని మాధవపురం రోడ్డులో బాలికపై అత్యాచారం ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ బుధవారం సాయంత్రం విలేకరులకు వెల్లడించారు. పట్టణంలోని స్టేట్ బ్యాంకు సమీపంలో 16 సంవత్సరాల బాలికను ఒక ఆటోడ్రైవర్, అతని స్నేహితురాలు కిడ్నాప్ చేసి పట్టణ శివారులోని డంపింగ్ యార్డు సమీపంలోని గోదావరి కాలువ గట్టు వద్దకు తీసుకువెళ్లి బలవంతంగా మద్యం పట్టించి అత్యాచారం చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. దీనిపై పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్లు, పోక్సో జువైనల్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేశారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో పిఠాపురం సీఐ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పిఠాపురం-గొర్స రోడ్డులోని రైసుమిల్లు సమీపంలో సంచరిస్తుండగా అత్యాచారానికి పాల్పడిన ఆటోడ్రైవర్ దుర్గాడ లక్ష్మయ్య అలియాస్ జాన్, అతడికి సహకరించిన ఇందిరా నగర్‌కు చెందిన కొంగుపూడి సుబ్బలక్ష్మిని అరెస్టు చేసి ఆటోను, మద్యం సీసాను సీజ్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.



నిందితులను చూపిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

ఉచిత న్యాయ సహాయానికి
డయల్ 15100

రాజమహేంద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయానికి 15100 నెంబరుకు ఫోన్ చేసి సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఈ నెంబరుకు విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా పోస్టర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించామన్నారు. పారా లీగల్ వలంటీర్ల ద్వారా ప్రభుత్వాస్పత్రులు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, పాఠశాలలు, కళాశాలలు, ఆటో స్టాండ్లు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో పోస్టర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

సేవ చేయడం అదృష్టం

● జమాల్‌ఖాన్‌తో సెల్ఫీ దిగాలనే కోరిక ఉండేది : మంత్రి సుభాష్



మాట్లాడుతున్న మంత్రి సుభాష్

చింతూరు, అక్టోబరు 9: ప్రజలకు సేవ చేయడం.. అందునా సొంత ఖర్చుతో వారిని ఆదుకోవడం అదృష్టమేనని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డబ్బున్న ప్రతిఒక్కరికీ ఇది సాధ్యంకాదని, సేవ చేయాలన్న తపన ఉన్న వారికే సాధ్యపడుతుందన్నారు. అల్లూరిజిల్లా చింతూరు మండలం నిమ్మలగూడెంలో బుధవారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు, ఆఫ్రిన్ ఆయుర్వేదిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొన్నటి వరదల్లో విలీన మండలాలతోపాటు విజయవాడ కూడా వెళ్లి మొత్తం 30వేల మందికి జమాల్‌ఖాన్ తన ట్రస్టు ద్వారా నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆయుర్వేద ఉచిత వైద్య సేవలతో పేదలను రోగ విముక్తులు చేస్తున్నారని కొనియాడారు. జమాల్‌ఖాన్ సేవలను సోషల్ మీడియాలో చూసినప్పుడల్లా ఒక్కసారైనా ఆయనతో సెల్ఫీ దిగాలన్న కోరిక ఉండేదన్నారు. ఆయన మొన్నటి ఎన్నికల్లో టీడీపీలో చేరి శిరీషదేవి గెలుపునకు కారణమయ్యారన్నారు. జమాల్‌ఖాన్ ప్రజాసేవను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. చింతూరు ఒడ్డుకు చెందిన 30 వరద బాధిత కుటుంబాలకు జేకేసీటీ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఐరన్ రాడ్లు, రేకులను మంత్రి అందజేశారు. ఎటపాకవాసులకు చెత్త తరలించేందుకు ట్రక్కు, ఇద్దరు వికలాంగులకు జైపూర్ లెగ్స్ అందజేశారు. కార్యక్రమంలో జేకేసీటీ ఛైర్మన్ జమాల్‌ఖాన్, టీడీపీ రంపచోడవరం ఇన్‌చార్జి చెల్లుబోయిన శ్రీనివాస్, చింతూరు నాయకులు పసుపులేటి సాల్మన్‌రాజు, ముత్యాల శ్రీరామ్, విలీన మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మంత్రికి వేంకటేశ్వరస్వామి జ్ఞాపిక ను జమాల్‌ఖాన్ అందజేశారు. పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను మంత్రికి అందజేశారు. పోలవరం జిల్లా ఏర్పాటుపై ఈ ప్రాంత ప్రజలకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని స్థానిక ఎమ్మెల్యేతో కలిసి గుర్తు చేస్తామని చెప్పారు.

పోలవరం నిర్వాసితుల ర్యాలీ

దేవీపట్నం/గోకవరం, అక్టోబరు 9: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోలవరం నిర్వాసితులు బుధవారం గోకవరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీ నుంచి ప్రధాన రహదారి మీదుగా గోకవరం శివారు గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలోని పునరావాస కాలనీ వరకు ప్రదర్శన నిర్వహించారు. ముందుగా గోకవరం తహసీల్దారు సరస్వతికి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆర్అండ్ఆర్ కాలనీ పూర్తికాక నాలుగు సంవత్సరాలుగా గోకవరం, కోరుకొండ, రాజమహేంద్రవరం తదితర చోట్ల అద్దె ఇళ్లల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవీపట్నానికి సంబంధించి నిర్వాసితులకు ఇచ్చిన 9 ఎకరాల భూమి కోర్టు గొడవల్లో ఉండడంతో దాన్ని రైతు సాగు చేసుకుంటున్నాడని ఆరోపించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో తగిన న్యాయం చేయాలని కోరారు. 2013భూసేకరణ చట్టం ప్రకారం అర్హులైన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, గ్రామాన్ని ఖాళీ చేసే సమయానికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ప్యాకేజీ జాబితాలో అర్హులుగా గుర్తించాలని, అద్దె ఇళ్లల్లో ఉంటున్న నిర్వాసితులకు అద్దె చెల్లించాలని, గిరిజన, గిరిజనేతర రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని నినాదాలు చేశారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు

వై.రామవరం, అక్టోబరు 9: పోషకాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ సూచించారు. మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా బుధవారం 95 మంది గర్భిణులకు గైనకాలజిస్టు షైమున టబస్టమ్ స్కానింగ్ పరీక్షలు జరిపి పలు సూచనలు చేశారు. పలు హైరిస్క్ కేసులు గుర్తించి వారిలో కొందరిని ఆసుపత్రిలో చేర్పించినట్టు రాహుల్ చెప్పారు.

దసరా క్రికెట్ టోర్నీ ప్రారంభం

వై.రామవరం, అక్టోబరు 9: దసరా సందర్భంగా వై.రామవరంలో క్రికెట్ టోర్నమెంటును సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ బుధవారం ప్రారంభించారు. పది రోజులు జరిగే ఈ టోర్నీలో మండలంలోని అన్ని పంచాయతీల నుంచి క్రీడాకారులు పాల్గొనాలని యూత్ కమిటీ సభ్యుడు గొర్లె నరేష్ కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సీఐ తో పాటు స్థల యజమాని సాసం మాణిక్యం, యూత్ సభ్యులు మఠం రాజశేఖర్, వెలిదిండి శివ, బత్తుల యోగేంద్రం, సిత్రా మురళి తదితరులు పాల్గొన్నారు.

'గుడిసెలు కూల్చే ప్రయత్నాలు మానుకోవాలి'

ఎటపాక, అక్టోబరు 9: పేద గిరిజనులు 18 ఏళ్ల క్రితం నిర్మించుకున్న గుడిసెలను కూల్చే ప్రయత్నాలను భద్రాచలం దేవస్థానం ఈవో మానుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకులు దాసరి సాయన్న, మునిగిల శివ కోరారు. శ్రీరామ్‌నగర్ కాలనీలో బుధవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. దేవస్థానం భూముల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు సాగుతున్నా అధికారులు ఎందుకు అడ్డుకోవట్లేదన్నారు. ఏజెన్సీలో దేవస్థానం భూములను గిరిజనులకు మాత్రమే కౌలుకి ఇవ్వాలి. కానీ గిరిజనేతరులు కౌలుకి తీసుకుని వందల ఎకరాల్లో జమాయిల్ సాగు చేస్తున్నారని ఆరోపించారు. నర్సింహరావు, వెంకటమ్మ, అంజలి, మల్లయ్య పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయాల్లో సరస్వతీ పూజ

రంపచోడవరం, అక్టోబరు 9: స్థానిక సంతమార్కెట్ సమీపంలో ఉన్న కనక దుర్గమ్మ, స్టేట్ బ్యాంకు సమీపంలో ఉన్న త్రిశక్తి స్వరూపిణి దుర్గాపరాదేవత ఆలయాల్లో అర్చకుడు గోవర్ధనం మణికంఠాచార్యులు, లింగాల సీతా రామాంజనేయ ప్రసన్నకుమార్ శర్మ, చింతా పవన్‌కుమార్ శర్మ విద్యార్థులతో సరస్వతీ పూజ జరిపించారు. కోదండ రామాలయం ఆవరణలో విరాట్ విజయ ఆంజనేయస్వామి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణకిషోర్, మండల ప్రఖండ ప్రముఖ్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి, కోశాధికారి నీలానాగు వీరభద్ర గుప్తా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, అక్టోబరు 9: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇందులో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పాల్గొని మాట్లాడారు. ఆమె మాజీమంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడులను కలిశారు.

పంట రుణాలు రెన్యువల్ చేయాలి

● ఎమ్మెల్యే బత్తులకు రైతుల వినతి



ఎమ్మెల్యే బత్తులకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

రాజానగరం, అక్టోబరు 9: రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేయ కుండా అధిక వడ్డీల పేరుతో రైతుల పై భారం మోపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని నందరాడ సొసైటీ రైతులు బుధవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తమ కోఆపరేటివ్ సొసైటీ పరిధిలో నరేంద్రపురం, నందరాడ, సీతారాంపురం గ్రామాలకు చెందిన రైతులు గత అనేక సంవత్సరాలుగా క్రాప్ లోన్స్ తీసుకుంటున్నామని, ప్రతి ఏడాది మార్చి 31 నాటికి 7శాతం వడ్డీ చెల్లించి పంట రుణాలను రెన్యువల్ చేయించుకుంటామని, అయితే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో చాలామంది రైతులు పంట రుణాలు రెన్యువల్ చేయించు కునేందుకు అప్పటికే అయిన వడ్డీ చెల్లించి రసీదులు పొందినప్పటికీ సొసైటీ ఉద్యోగులు ఇప్పటివరకు రుణాలు రెన్యువల్ చేయకుండా రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో 7శాతం చెల్లించాల్సిన వడ్డీ క్రాప్ లోన్లకు 13శాతం చెల్లించాలని అధికారులు రైతులను ఒత్తిడులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులపట్ల నిర్ల్యంగా వ్యవహరిస్తున్న సొసైటీ అధికా రుల తీరుపై తగు చర్యలు తీసుకోవాలని రైతులు అడబాల గణపతిరావు, ఆళ్ల శివనాగరాజు, పలివెల వాసు, నూనె వెంకన్న, అడబాల వీరసత్యనారాయణ, వాకచర్ల విష్ణుమూర్తి, తాటికొండ రాంబాబు, చిట్టిప్రోలు సత్తిబాబు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

● విజయదుర్గ అమ్మవారికి చండీహోమం చేసిన గన్నికృష్ణ
● కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు
● ఏడోరోజు సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు
● చిన్నారులచే సామూహిక సరస్వతీ పూజలు



అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న గన్ని కృష్ణ, మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9: రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ విశిష్ట చండిహోమం నిర్వహించారు. రాజమహేంద్రవరం శ్రీరామ్‌నగర్‌లోని శ్రీసంకట హర వరసిద్దివినాయక ఆలయప్రాంగణంలో బుధవారం విశేష చండి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని గన్నికృష్ణ చేశారు. కోటా గణేష్ శర్మ, ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు మర్ల వెంకట మురళీకృష్ణ శర్మ పర్యవేక్షణలో ఆలయలో వున్న విజయదుర్గ అమ్మవారికి విశేష చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నికృష్ణ మాట్లాడుతూ ప్రతిఏటా మూలానక్షత్రం పురస్కరించుకుని చండీహోమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, జీఎస్ఎల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, గన్నికాశింబి, మాజీ ఎమ్మెల్సే ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కాశినవీన్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబు, ఆర్యాపురం బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్రావు, కోళ్ళబాబు, జనసేన నగర ఇన్‌చార్జీ అనుశ్రీ సత్యనారాయణ, సిసిసి ఎండీ పంతం కొండలరావు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డిమణి, చాంబర్ అధ్యక్షుడు తవ్వారాజా, టి.బాబి, నిమ్మహూడి గోవింద్ పాల్గొన్నారు.

దేవీచౌక్‌లో ఘనంగా మూలానక్షత్ర పూజలు

దేవీచౌక్ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం మూలానక్షత్రం సందర్భంగా భారీగా భక్తులు దేవీచౌక్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకుదర్శనమిచ్చారు. విద్యార్థులు, పిల్లలుతో తల్లిదండ్రులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి 10గంటలకు మయసభ, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన జరిగింది.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కొబ్బరికాయల మార్కెట్ శ్రీ విఘ్నేశ్వర రాధాకృష్ణ సహిత కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలు, వైసీపీ 4వ క్లస్టర్ అధ్యక్షుడు పెంకే సురేష్ కుమార్, సుధారాణి దంపతులు, ఆలయ అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో బుధవారం సరస్వతీ దేవి అలంకారంతో పూజలు నిర్వహించారు. అలాగే సరస్వతీఘాట్‌లో సత్యప్రసాద్‌వారి శిష్యబృందంచే వీణా వాయిద్య కచేరీ శ్రోతలను అలరించింది.

దివాన్‌చెరువు: శరన్నవరాత్రి ఉత్సవాలు వివిధ గ్రామాలలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు ఏడవ రోజైన బుధవారం జగన్మాతను సరస్వతీదేవిగా భక్తులు పూజించారు. ఈ ఉత్సవాలలో భాగంగా దివాన్‌చెరువులోని ఆగమాశ్రమంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి అర్చనలు, కుంకుమపూజలు, సరస్వతి పూజలు, నవఅష్టోత్తర, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అలంకరణ చేశారు. అలాగే స్థానిక రాంబాబు డాక్టరు గృహావరణలోగల శ్రీవిశ్వేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమపూజలతోపాటు చండీహోమం నిర్వహించారు. అలాగే గ్రామంలో ఏర్పాటుచేసిన మండపాలలోను, కనకదుర్గమ్మ అలయంలోనూ కుంకుమపూజలు జరిగాయి. పాతతుంగపాడు, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం గ్రామాలలో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి.



ధవళేశ్వరం: సరస్వతి అలంకరణలో..



రంగంపేటలో అమ్మవారు



అనపర్తి ఆరు అడుగుల అగరబత్తితో భక్తుడు

గోకవరం: గోకవరంలోని వీరభద్రునిగిద్దెలో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగు తున్నాయి. ఏడవ రోజైన బుధవారం అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు 300మంది చిన్నారులచే ఆలయ అర్చకులు రాజాశర్మ, కుమార్ శర్మలచే సరస్వతి పూజ చేయించారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు దంపతులు, కుటుంబ సభ్యులు అన్నసమారాధన నిమిత్తం లక్షా 70వేల రూపాయలను విరాళంగా అందజేస్తామన్నారు. దేవీచౌక్ సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో సుమారు రూ.1,50,000లతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు గోకవరం గ్రామానికి చెందిన పట్నాల నాగేంద్ర అనే భక్తుడు ముందుకొచ్చారు. తంటికొండలో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ బదిరెడ్డి అచ్చన్న దొర, సువర్ణతులసి దంపతులు ఈ చండీయాగాన్ని చేశారు. అక్షరాభ్యాసం నిర్వహించి పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోడలు, జడ్పీ మాజీ ఛైర్మన్ జ్యోతుల నవీన్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

రాజానగరం: మండలంలో చక్రద్వారబంధం దేవీచౌక్‌లో మూల సరస్వతి పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 250 మంది చిన్నారులు అమ్మవారికి పూజలు చేశారు. చిన్నారులందరికీ ప్రముఖ వ్యాపారవేత్త దవులూరి పూసలరావు దంపతులు పుస్తకాలు, పెన్నులు, గాజులు, రవికెల ముక్కలు అందజేశారు. నల్లమిల్లి సూర్యారావు భోజన సదుపాయాలు కల్పించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బిక్కవోలు: గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులు సరస్వతిదేవి పూజలు చేశారు. రాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు సరస్వతిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. కరణంగారి మేడలో చిన్నారులు సరస్వతిదేవికి పూజలు చేశారు. ఆరికరేవుల, పందలపాక, కొంకుదురు గ్రామాల్లో చిన్నారులు అమ్మవారికి పూజలు చేసారు. చిన్నారులందరికి ఉత్సవ కమిటీ సభ్యులు పెన్నులు, పుస్తకాలు బహూకరించారు.

ధవళేశ్వరం: బాలాత్రిపుర సుందరి సమేత అగస్టేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు మహాసరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం విద్యార్థులచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి బుధవారం అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



దేవీచౌక్‌లో అమ్మవారికి సరస్వతి పూజలు చేస్తున్న దృశ్యం

కడియం: శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం దుర్గాదేవి భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. వీరవరం, కడియం, కడియపులంక, పొట్టిలంక, వేమగిరితోట, వేమగిరి, కడియపుసావరం, జేగురుపాడు, మాధవరాయుడు పాలెం, మురమండ, దుళ్ల గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో ఉన్న దుర్గాదేవి భక్తులకు సరస్వతీదేవి అవ తారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలవద్ద విద్యార్థులు, చిన్నారులు సరస్వతీ పూజలు నిర్వహించారు.

ఆరు అడుగుల అగరబత్తితో..

అనపర్తి: దేవీ నవరాత్రులలో భాగంగా అనపర్తి మండలం పొలమూరు ఎన్టీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించిన సరస్వతీ పూజల సందర్భంగా పొలమూరుకు చెందిన భక్తుడు చిట్టూరి నాగయ్య ఆరు అడుగుల అగరబత్తీని వెలిగించి అమ్మవారి సమక్షంలో తన భక్తిని చాటుకున్నాడు.

కోరుకొండ: జంబుపట్నంలో నూతనంగా నిర్మించిన శివాలయంవద్ద ఏర్పాటు చేసిన దుర్గమండపంలో 108 మంది చిన్నారులచే సరస్వతిదేవికి సామూహిక సహ స్ర కుంకుమార్చన నిర్వహించారు. వీరందరికీ ఆలయ కమిటీ వారు పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు బహూకరించారు. కోరుకొండ కాపవరం జంక్షన్‌లో వెలిసిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద బుధవారం 108 మంది దంపతులచే సామూహిక విశేష సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అనువంశక ధర్మకర్త నీరుకొండ వర్ధన విజయభాస్కర రావు దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు మర్ల సీతారామశాస్త్రి, ప్రకాశరావు, సురేష్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ వారు విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు బహూకరించారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద మూలా నక్షత్రం పురస్కరించుకుని సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి. గాదరాడ ఓం శివశక్తి పీఠం నందు సామూహిక సహ స్ర కుంకుమార్చనలు జరిగాయి. నర్సాపురం,శ్రీరంగపట్నం, బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి, కోటికేశవరం, రాఘవాపురం, పశ్చిమగోనగూడెం గ్రామాల్లో పెద్ద ఎత్తున భవానీలు అమ్మవారి పూజలు నిర్వహించారు.

రంగంపేట: శ్రీసరస్వతిదేవి జన్మ నక్షత్రం పురస్కరించుకొని సరస్వతిమాత విగ్రహాలకు, చిత్రపటాలకు దుర్గామాతను సరస్వతి మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కోటపాడులో సరస్వతిదేవి రూపాలంకరణ చేసి విద్యార్థులచే ప్రత్యేక పూజలు చేశారు. రంగంపేట, పెదరాయవరం, నల్లమిల్లి, వడిశలేరు ఏడీబీ రోడ్డువద్ద గల దేవి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టెన్త్ విద్యార్థులకు వృత్తి విద్యా తరగతులు

దివాన్‌చెరువు, అక్టోబరు 9 : ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యా తరగతులు నిర్వహిస్తున్నట్లు దివాన్‌చెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి.లక్ష్మి తెలిపారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శిక్షణాతరగతులలో భాగంగా వీటిని నిర్వహిస్తున్నామని బుధవారం తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో భాగంగా ఆటోమేటివ్, బీఎఫ్ఎస్‌ఐ విభాగంలో ఇంటర్న్‌షిప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈశిక్షణా తరగతులలో ఏపీ ఒకేషనల్ కోఆర్డినేటర్ భారతి, జిల్లా జీసీడీవో ఎస్తేరురాణి, ఒకేషనల్ కోఆర్డినేటర్ రమేష్, సమగ్ర ఏపీసీ సుభాషిణి స్థానికంగా ఉన్న ద్విచక్రవాహన మరమ్మతులుషోరూమ్‌లను, బ్యాంకులను సందర్శించారు.

మాజీ ఎంపీ భరత్‌రామ్‌కు మతిభ్రమించింది

● మండిపడ్డ టీడీపీ నేత కుడుపూడి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు9: రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్ రామ్‌కు మతిభ్రమించిందని టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా మద్యంషాపులకు వేలం వేస్తోందన్నారు. ఇందులో ఎమ్మెల్యే జోక్యం ఏముందని భరత్‌రామ్ చెప్పాలని ప్రశ్నించారు. వైన్ షాపుల కోసం నువ్వుకూడా ప్రయత్నాలు చేస్తున్నావని తెలిసిందన్నారు. మీ ప్రభుత్వంలా మా ప్రభుత్వం అడ్డదిడ్డంగా వ్యవహరించడంలేదని ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తుందన్నారు. 2014-19వరకు వైన్‌షాపులు నడిపిన అలవాటు నీకుందన్నారు. అంతేగాని తమ ఎమ్మెల్యేకు అటువంటి జోక్యాలు లేవన్నారు. గీత కార్మికులకు 10శాతం షాపులు కేటాయించాలని తమ ప్రభుత్వం హామీ ఇచ్చి నిలబెట్టుకుంటుందన్నారు. 71వేల ఓట్లమెజార్టీతో నగర ప్రజలు ఆదిరెడ్డిని గెలిపించిన నాటి నుంచి భరత్ రామ్ నీ బుర్ర పనిచేయడంలేదని ఎద్దేవా చేశారు. మీరు పెంచిన గంజాయి, బ్లేడు బ్యాచ్‌లను నియంత్రించారని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నగర బీసీసెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, కడియాల భద్రరావు, చింపల్లి నాని, రాయుడు గణేష్, పుల్లూరి శ్రీను, నాగమణి పాల్గొన్నారు.

అనపర్తి సీఐగా సుమంత్ బాధ్యతల స్వీకరణ



అనపర్తి, అక్టోబరు9: అనపర్తి సీఐగా వీఎల్‌వీకె సుమంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా బాధ్యతలు నిర్వహించిన పి.శివగణేష్ వీఆర్‌కు వెళ్లడంతో కాకినాడ జిల్లాలో సీఐగా విధులు నిర్వహిస్తున్న సుమంత్ బదిలీపై అనపర్తి వచ్చారు. గతంలో ఆయన అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడి ఎస్‌ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా సుమంత్ మీడియాతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో లాండ్ ఆర్డర్‌ను పరిరక్షించేందుకు కృషిచేస్తానని అన్నారు. అన్నివేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలిందిస్తానన్నారు. సీఐగా బా ధ్యతలు చేపట్టిన సుమంత్‌ను కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కణుపూరులో బోనాల పండుగ



కణుపూరులో బోనాల పండుగ దృశ్యం

కోరుకొండ, అక్టోబరు 9: మండలంలోని కణుపూరులోని నూకాలమ్మ అమ్మవారికి బుధవారం బోనాల పండుగను నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు బోనాలను తలపై పెట్టుకుని గ్రామమంతా ఊరేగారు. ఆలయంలో బోనాలు దించి ప్రత్యేకపూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో జనసేన జిల్లా కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బోనాలు ఎత్తుకుని గ్రామస్తులతో కలిసి నడిచారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. జనసేన మండ్డఉపాధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్య రాజానగరమే లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే రాజా

దివాన్‌చెరువు, అక్టోబరు 9: ఆరోగ్య రాజానగరమే లక్ష్యంగా గ్రామీణ ప్రజానీకానికి నాణ్యమైన విద్యను జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడిరాజా అన్నారు. దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు 13వ వర్ధంతి సందర్భంగా పుణ్యక్షేత్రంలో జీఎస్‌ఎల్ ఆసుపత్రి, ఫస్ట్‌ప్లస్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరంను డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని జక్కంపూడిరామ్మోహనరావు విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెవెన్యూ గ్రామ సభలలోను రైతుకు నిరాశే

సీతానగరం, అక్టోబరు 9: బుధవారం సీతానగరం మండలం, పురుషోత్తపట్నం గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలపట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే ఫలితంగా రైతులు నానా తంటాలు పడుతున్నారు. అప్పుడు జరిగిన తప్పులు సరిచేసుకోవడం రైతులకు కష్టంగానే ఉంది. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నా దానికి సరైన పరిష్కారం చూపడం లేదు. మీరు దరఖాస్తు ఇవ్వండి పైకి పంపుతామని చెబుతుండడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



దానవాయిపేట గాంధీపార్కు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డితో కూటమి నాయకులు

దానవాయిపేట పార్కు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9: రాజమహేంద్రవరం దానవాయిపేటలో ఆధునీకరించిన గాంధీపార్కును బుధవారం రాత్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ పార్కును ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేశవరం రైల్వే గేటు సమీపంలో మధ్యాహ్నం 12.30 సమయంలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ రైల్వేపోలీస్ ఎస్‌ఐ కె.మావుళ్లు తెలిపారు. మృతురాలికి సుమారు 50ఏళ్లు ఉంటాయని, ఆచూకీ తెలిసినవారు 9491003239కి తెలపాలని కోరారు.

రంగంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 121 దరఖాస్తులు

అనపర్తి, అక్టోబరు 9 : రంగంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల పరిధిలో బ్రాందీ షాపుల కోసం బుధవారం సాయంత్రానికి 121 దరఖాస్తులు అందినట్లు సీఐ సుధ తెలిపారు. అనపర్తి మండల పరిధిలో 38, బిక్కవోలు మండల పరిధిలో 43, రంగంపేట మండల పరిధిలో 40 దరఖాస్తులు అందినట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజుల పాటు గడువును ప్రభుత్వం పెంచడంతో ఈనెల 11వ తేదీ సాయంత్రం 7గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు.

23ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



ఆర్‌సీఎం హైస్కూల్ పూర్వవిద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9: రామహేంద్రవరం ఆల్‌కట్ గార్డెన్స్‌లోని ఆర్‌సీఎం హైస్కూల్ విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత కలిశారు. ఈ ఆత్మీయ కలయిక సందడిగా సాగింది. ఉదయం నుంచి సాయంత్ర వరకు పూర్వవిద్యార్థులు సంతోషంగా గడిపారు. 2001 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఈ విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరంతా బుధవారం స్కూల్ వద్ద కలిసి ఆలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

నైపుణ్యతతోనే భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు

అనపర్తి, అక్టోబరు 9: విద్యార్థులు నైపుణ్యత సాధిస్తే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అనపర్తి బాలికోన్నత పాఠశాల వృత్తి విద్యా కోర్సుల శిక్షకు రాలు ఎస్.నాగమణి అన్నారు. దసరా సెలవుల సందర్భంగా సర్వశిక్ష ఆధ్వర్యంలో ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈకోర్సులలో భాగంగా అనపర్తిలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్కులపై శిక్షణ అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రధానోపాధ్యాయిని కర్రి కళ్యాణి మాట్లాడుతూ తరగతిగదిలో భోదించే పాఠాలతో పాటుగా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. శిక్షకురాలు నాగమణిని సహకరించిన లక్ష్మీప్రియలను హెచ్‌ఎం కళ్యాణి అభినందించారు.

'వరిలో సమగ్ర సస్యరక్షణ కీలకం'

కోరుకొండ, అక్టోబరు9: ప్రస్తుత తరుణంలో సార్వా వరి పైరుపై ఎండాకు తెగులు సోకిందని అధిక నత్రజని వినియోగించడంవల్ల పొటాష్ ఎరువు వాడకపోవడం వల్ల సాగునీరు, వర్షపునీటి ద్వారాను తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని తగిన యాజమాన్య పద్ధతులు పాటించి బ్యాక్టీరియా, ఎండు తెగులును నివారించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు.

చెస్‌కు విశేష ఆదరణ : మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 9 : చెస్‌క్రీడకు ఎంతో ప్రాచుర్యం ఉందని, ఇష్టంతో దీక్షతో ఆడే ఆట చెస్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో చెస్ అకాడమీ, ట్యూషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గేష్ చిన్నారులతో కలసి చెస్ ఆడారు.

'లింగ నిర్ధారణ పరీక్షలు నేరం'

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 9 : సాంస్కృతిక విశ్వాసాలు, సామాజిక కట్టుబాట్లతో లింగ వివక్ష ఏర్పడిందని, దీన్ని ఎవరు ప్రోత్సహించినా శిక్షార్హులే అని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ చట్టం 1994కు లోబడి ఉప జిల్లాస్థాయి కమిటీ సమావేశానికి ఆర్డీవో కృష్ణ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. ఈ సమావేశంలో మెడికల్ అండ్ హెల్త్ అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, ఇతర వైద్యాధికారులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టీపీని పరిశీలించిన టీకే

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 9 : ఎస్‌టీపీ ప్లాంట్‌ను రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పరిశీలించారు. స్థానిక రోడ్డులోని మురుగునీటి శుద్ధి కర్మాగారంను బుధవారం టీకే పరిశీలినలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.54 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 34 కోట్లతో మునిసిపల్ మ్యాచింగ్ గ్రాంటు రూ.7కోట్లతో ఎస్‌టీపీ నిర్మాణం పనులు గురించి ఎస్‌ఈ పాండురంగారావు వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ మదర్సఅలీ, ఏఈ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వెదుళ్ల పీఏసీఎస్‌లో సీఈవోతోపాటు మరో ఇద్దరు సస్పెండ్

సీతానగరం, అక్టోబరు 9: సీతానగరం మండలం వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో రూ.56లక్షల నగదు గల్లంతు వ్యవహారంలో ఆ సంఘం సీఈవోతో పాటు మరో ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ మంగళవారం సస్పెండ్ చేశారు. ఈనెల 2న ఆంధ్రజ్యోతి దినపత్రికలో పీఏసీఎస్‌లో 56 లక్షలు గల్లంతు కథనంలో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కృష్ణమోహన్ ఏఆర్ శివకుమార్ రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ క్రాంతి కృష్ణలు మంగళశారం వెదుళ్లపల్లి సహకార సంఘంలో రికార్డులను పరిశీలించారు. నగదు పూర్తిస్థాయిలో జమచేయకపోవడంతో ఇందుకు సంబంధించిన సీఈవో సురేంద్ర, గుమస్తా పోశియ్య, ఎరువుల సేల్స్ ఉమన్ భారతిలను సస్పెండ్ చేశారు. వారి నుంచి రికవరీ యాక్టు ద్వారా వసూలు చేస్తామని కృష్ణమోహన్ తెలిపారు

కాతేరులో ఇసుక రేవుల్లో గాడి తవ్వించిన అధికారులు

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 9:రాజమహేంద్రవరంరూరల్ మండలం కాతేరు గ్రామంలో ఇసుక రేవుల్లోకి వెళ్లే మార్గాలను ఎక్స్‌కవేటర్‌తో గాడి తవ్వించారు. అక్రమ ఇసుక తవ్వకాలు భారీస్థాయిలో జరుగుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు రావడంతో ఇప్పటికే వెంకటనగర్‌లో ఇసుక ర్యాంప్‌లకు అడ్డంగా భారీ కేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు బుధవారం కాతేరులో 10 ర్యాంప్‌లకు వెళ్లే మార్గంలో గాడి తవ్వించి వాహనాలు లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా చేశారు.

నేడు ఊలపల్లిలో జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

బిక్కవోలు, అక్టోబరు 9: ఊలపల్లి ఉన్నత పాఠశాల ఆటస్థలంలో గురువారం జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఇన్విటేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఊలపల్లి స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పూర్వపు జాతీయ క్రీడాకారులైన చంటి, సాయిల జ్ఞాపకార్థం ఈపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆరు బెస్ట్ టీమ్‌లను పోటీలకు ఆహ్వానించామన్నారు. పోటీలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారని టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



మెయిన్‌రోడ్డులో చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

యుద్ధప్రాతిపదికన చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన యంత్రాంగం

నిడదవోలు, అక్టోబరు 9: ఎక్కడ చూసినా చెత్తమయం...ఏ రోడ్డు చూసినా అపరిశుభ్రతకు నిలయమంటూ..నిడదవోలు పురపాలక సంఘం తీరుపై బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు బొమ్మ, శశి కాలేజ్ రోడ్డు తదితర ప్రాంతాల నుంచి పారిశుధ్య సిబ్బంది చెత్త తొలగింపును యుద్ధప్రాతిపదికన చేపట్టారు. అనంతరం వ్యాధులు వ్యాపించకుండా వారు బ్లీచింగ్ చల్లారు.

ఖాతాదారుల సంతృప్తే బ్యాంకుల లక్ష్యం

నల్లజర్ల, అక్టోబరు 9: ఖాతాదారుల సంతృప్తే బ్యాంకుల పరమావధి అని నల్లజర్ల ఎస్‌బీఐ మేనేజర్ శ్రావ్య అన్నారు. బుధవారం నల్లజర్ల హైస్కూల్‌లో విశ్రాంత ఉద్యోగుల మండల సమావేశం మండలాధ్యక్షుడు ఐవి సత్యం అధ్యక్షతన జరిగింది. మేనేజర్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు 76 ఏళ్ల వరకు బ్యాంకు నుంచి రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఐవీ సత్యం, ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

14 వరకు మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ

కొవ్వూరు, అక్టోబరు 9: మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు సర్కిల్ పరిధిలోని 16 షాపులకు ఇప్పటి వరకు 405 దరఖాస్తులు స్వీకరించామని, 14న డ్రా ద్వారా షాపులు కేటాయింపు జరుగుతుందన్నారు.

MUNICIPAL CORPORATION::RAJAMAHENDRAVARAM

REQUEST FOR PROPOSAL

Rep/Tender No.137/RFP/MCR/2024-25 Dated:08-10-2024

Requested for proposal in invited for " **Design, Supply, Installation Commission, and Comprehensive Maintenance of 9 Nos of Different Capacities Solar PV Systems at Various Locations in Rajamahendravaram Municipal Corporation on Build own, Operate and Transfer (BOOT) Basis..,**

RFP can be down loaded from e-procurement website **www.apeprocurement.gov.in** in Service sector from 10-10-2024 at 10.00 A.M on wards. Last date of time of receipt of RFP on or before dt.04-11-2024 upto 3.00 PM

Sd/- KETAN GARG, IAS.,
Commissioner
Municipal Corporation, Rajamahendravarm

ప్రకటన

ఇందుమూలముగా అందరికీ తెలియ చేయునది ఏమనగా నా క్లయింట్ నాగార్జున టెక్నికల్ సొసైటీ రి.స.నెం.368/81 జొన్నలపాలెం రోడ్, భీమవరం వారు

శ్రీమతి సిగటాపు శ్రీదేవి, భర్త, శివకృష్ణ అర్జునరావు, డోర్ నెం.2-25 16/4 నిడదవోలు వారి వద్ద రొక్కం బదులు పొందుటకు గాను హామీగా ది.31.12.2021 తేది గల క్రియ దస్తావేజును తనఖా దస్తావేజు కి బదులుగా వ్రాసియున్నారు. సదరు క్రియం అమలు కాబడి యుండలేదు. ఆస్తి రి.స.నెం.13. డోర్ నెం.2-253/1.Ass No.578 Ac 1-48 1/2 Cents అనగా 7335.8 చదరపు గజాలు ఆస్తి స్వాధీనము హక్కుభుక్తములు గల నా క్లయింట్ గారి వద్దనే వుండియున్నది. పైన తెలిపిన శ్రీమతి సిగటాపు శ్రీదేవి గారికి స్వాధీనం గాని హక్కు భుక్తములు కాని సదరు ఆస్తిపై ఏమియు లేవు. రికార్డ్స్ మొత్తం నా క్లయింట్ గారి పేరున వుండియున్నది.

దరిమిలా ది.02.07.2024 తేదిగల సదరు దస్తావేజుకే షరతుగ ది.03.07.2024 బాకీ షరతుల మార్పు అంగీకార పత్రం వ్రాయబడి అమలులో వుండి వున్నది. సదరు రీత్యా ది.31.12.2024 వరకు నా క్లయింట్ బాకీ తీర్పు గడువువున్నది.

నా క్లయింట్ బాకీ తీర్చుతామని బ్యాంకు ఖాతా నెంబరు సొమ్ము ట్రాన్స్‌ఫర్ నిమిత్తం తెలియచేయుమని ది.25.09.2024 తేది నోటీసు ఇవ్వగా సదరు శ్రీమతి సిగటాపు శ్రీదేవి గారు తిప్పి పంపివేసినారు.

కావున అందరికీ తెలియజేయునది ఏమనగా శ్రీమతి సిగటాపు శ్రీదేవి గారికి పై ఆస్తిపై స్వాధీన హక్కుభుక్తములు ఏమిలేవు. అందువలన ఆమె వద్ద ఎవరైనా తనఖాలు వగైరాలు దస్తావేజులు వ్రాయించుకొనిన అవి చట్టరీత్యా చెల్లవు మరియు నా క్లయింట్ వాటికి బాధ్యత వహించరని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

నా క్లయింట్ గారి వద్ద శ్రీమతి సిగటాపు శ్రీదేవి గారు రూ.100-00 విలువ గల ఖాళీ స్టాంప్ పేపర్ (తాడేపల్లిగూడెం లో ది.31.12.2021) న కొనిన పై సంతకములు తీసుకునియున్నారు. సదరు స్టాంప్ పేపర్‌పై ఏమైనా వ్రాసిన అది నా క్లయింట్ ని బైండ్ చేయదు.

ఇందుమూలముగా ఈ బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది.

Kovvuru
Dt.09.10.2024

Ch. Naga Kumar Advocate
Kovvuru, Cell: 9440985149

ఆకట్టుకున్న సరస్వతీదేవి అలంకరణలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

కొవ్వూరు, అక్టోబరు 9: దేవీ నవరాత్రుల్లో భాగంగా బుధవారం ఏడోరోజు అమ్మవారికి విశేష అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని గోష్పాద క్షేత్రం బాలాత్రిపుర సుందరి, సంస్కృత పాఠశాలలో లలితాపార్వతి, జ్ఞాన సరస్వతి ఆలయాలతో పాటు, మెరకవీధి, ఆర్టీసి డిపో, మున్సిపల్ కార్యాలయాల వద్ద దుర్గాదేవికి పలు పూజలు చేశారు.

నిడదవోలు: తిమ్మరాజుపాలెం గ్రామం లోనున్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఏడో రోజు మూలా నక్షత్రం సందర్భంగా 800 మంది విద్యార్థినీ, విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. పూజల్లో పాల్గొన్న వారికి నిడదవోలుకు చెందిన బూరుగుపల్లి సత్యనారాయణ దంపతులచే పుస్తకాలు, తణుకుకు చెందిన దాత పెన్నులు పంపిణీ చేశారు. అమ్మవారి ఆలయంలో బుధవారం 507 మంది దంపతులు ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. బుధవారం రూ.2,43,685 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

తాళ్లపూడి: మూలా నక్షత్రం సందర్భంగా పలు ఆలయాల్లో సరస్వతీదేవికి పూజలు జరిపారు. తాళ్ళ పూడిలో నవదుర్గా సహిత కనకదుర్గాదేవి, గాయిత్రీ దేవి, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో సరస్వతీ పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థినులు, మహిళ లు, భక్తులు పాల్గొన్నారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో భవానీ మాలధారులు గ్రామో త్సవం నిర్వహించారు. గ్రామ దేవత నాగారమ్మ ఆలయంలో విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు. చాగల్లు శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు జరిగాయి. దానవయ్యిపేటలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిట్టి కనక దుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు సరస్వతి పూజలు చేశారు.



రూ.11 లక్షలతో అలంకరించిన పుంతలో ముసలమ్మ అమ్మవారు

దేవరపల్లి: దేవీ నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. విద్యార్థులు సరస్వతిదేవీకి పూజలు చేశారు. మూడు బొమ్మల సెంటర్ సౌభాగ్య దుర్గాంబిక ఆలయం వద్ద సరస్వతి దేవి హోమాన్ని వేదపండితులు పెదసనగంటి సాయి బాబా, శశికాంత్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. విద్యార్థు లకు దేవరపల్లి గ్రామానికి చెందిన అనిశెట్టి శ్రీనివాసరావు, ఉమాకుమారి దంపతులు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. బాలదుర్గమ్మ ఆలయం, పల్లపువీధి రామాలయం వద్ద అమ్మవార్లను సరస్వతిదేవిగా ఆలంకరించారు. విద్యార్థులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెరవలి: ముక్కామలలోని వేంద్రవారి వీధిలో నున్న పుంతలో ముసలమ్మ అమ్మవారికి 11 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 25వ స్వర్ణోత్సవంలో భాగంగా కరెన్సీ నోట్లతో అలంకరించినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థినులకు ఇంటర్‌షిప్‌పై శిక్షణ

నిడదవోలు, అక్టోబరు 9: విద్యార్థినులకు చదువుతోపాటు ఇంటర్‌షిప్ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరమని వొకేషనల్ స్టేట్ కోఆర్డినేటర్ భారతి అన్నారు. బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ఇంటర్‌షిప్‌పై శిక్షణ నిర్వహించారు. వొకేషనల్ స్టేట్ కోఆర్డినేటర్ భారతి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల వృత్తులు, ఉద్యోగాలపై అవగాహన కలిగించేందుకు ఈ శిక్షణ చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్తేరు రాణి, కె.జిలానీ, జి.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ జన్మదిన వేడుకలు

చాగల్లు, అక్టోబరు 9: టీడీపీ యువ నాయకుడు నాదెళ్ల శ్రీరామ్ జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకుడు శ్రీరామ్ అని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, ఈదుపుగంటి సుబ్బారావు, దొంగ రామకృష్ణ, జొన్నకూటి సబ్బారావు, ఊబా దుర్గ, పాటిమ్మపేట రామాలయం యూత్, మండలంలోని ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ సహా కూటమి నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గంలోని పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కొవ్వూరు, అక్టోబరు 9: కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణ తరగతులు ముగిసాయి. గ్రామ పంచాయతీ పరిపాలనలో 11 అంశాలపై రెండు రోజులుగా పంగిడి కార్యదర్శి ముత్యం శిక్షణ అందించారు. ప్రభుత్వశాఖల మండల అధికారులు వారి శాఖలపై అవగాహన కల్పించారు. 16 గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ప్రజాస్వామ్యంలో పంచాయతీ వ్యవస్థ కీలకమైందని పంచాయతీ సీనియర్ కార్యదర్శి నశీరుద్దీన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రెండో రోజు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ శాంతి, కార్యదర్శులు బీఎస్ రామచంద్రరావు, ఎస్.రవికిషోర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ హెడ్‌వర్క్స్ స్కీం పరిశీలన

తాళ్లపూడి, అక్టోబరు 9: మండలంలో శుద్ధి చేసిన గోదావరి జలాల హెడ్ వర్క్స్ స్కీంను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఎస్ఈ ఎం.సత్యనారాయణ బుధవారం సందర్శించారు. నీటిని పంపే మోటార్లతో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఏఈ సూర్యహన్ తీసుకురాగా జాక్‌వెల్‌లో సాంకేతికపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఈ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఈ టీవీ గిరి, డీఈఈ ఎస్.అప్పారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అన్యాయం

దేవరపల్లి, అక్టోబరు 9: అసంఘటిత కార్మికులకు చట్టం చేయాలని విశాఖ ఉక్కుతో సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ ఆపాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే.మస్తాన్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ లేదంటూనే 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘం నాయకులు గంటా కృష్ణ, సీహెచ్ నాగరాజు, హంస్సే ప్రసాద్, పటాన్ బాజీ, వెంకట్రావు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెగువేరాకు ఘన నివాళి

నిడదవోలు, అక్టోబరు 9: ప్రపంచ మానవాళి సమానత్వం కోసం ప్రాణాలను బలిచ్చిన మహనీయుడు చేగువేరా అని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలో సీఐటీయూ స్తూపం వద్ద చేగువేరా వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు, టి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వివాహిత ఆత్మహత్య

నిడదవోలు/చాగల్లు, అక్టోబరు 9: కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఒక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. నిడదవోలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం...చాగల్లు మండలం దారవరం రైల్వే గేటు వద్ద బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కొండేపాటి కుమారి(41) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందన్నారు. తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో ఇల్లు వదిలి బయటకు వెళ్ళిపోయేదని తెలిపారు. మంగళవారం రాత్రి అత్తమామలతో గొడవపడి వెళ్ళిపోయిందని దారవరం రైల్వేగేటు సమీపంలో మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందన్నారు. రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్ళగా మృతురాలిని కొండేపాటి కుమారిగా గుర్తించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిడదవోలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలిపారు.

చెస్ క్రీడకు విశేష ప్రాచుర్యం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 9: చెస్ క్రీడకు ఎంతో ప్రాచుర్యం ఉందని, ఇష్టంతో దీక్షతో ఆడే ఆట చెస్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులో చెస్ అకాడమీ, ట్యూషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గేష్ చిన్నారులతో కలసి చెస్ ఆడారు.



నాదెండ్ల తనిఖీలతో హడల్!

రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ కొవ్వూరు మండలం కాపవరంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తొలి ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించేందుకు బుధవారం సాయంత్రం వచ్చారు. ఆ కార్యక్రమం అనంతరం విజయవాడ కారులో బయలుదేరుతూ ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించేశారు. రాత్రి వేళ మొదలైన ఈ ఆకస్మిక దాడులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఊహించని విధంగా జరిగిన ఈ ఆకస్మిక తనిఖీలతో అధికారులంతా పరుగులు పెట్టారు. రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలించి విదేశాలకు ఎగుమతి చేస్తున్న రైస్ మిల్లుల లక్ష్యంగా ఈ తనిఖీలు సాగాయి. ఇందులో భాగంగా తొలుత నల్లజర్ల మండలంలో రెండు రైస్ మిల్లుల్లోనూ, తర్వాత దేవరపల్లిలో మరో రైస్‌మిల్లులోనూ తనిఖీలు చేశారు. మళ్లీ నల్లజర్ల సమీపంలో రహదారిలో లారీలను సైతం ఆపి తనిఖీలు చేశారు. అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లులను సీజ్ చేయించి విజయవాడ తిరిగి వెళ్లారు.

- మంత్రి మనోహర్ ఆకస్మిక తనిఖీలు
- నల్లజర్లలో భారీగా రేషన్ బియ్యం పట్టివేత
- దేవరపల్లి, నల్లజర్లలోని రైస్‌మిల్లుల్లో దాడులు
- 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్
- కేసులు నమోదు చేస్తాం : మంత్రి మనోహర్



దేవరపల్లిలోని ఓ రైస్‌మిల్లులో బుధవారం రాత్రి బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న మంత్రి మనోహర్



నల్లజర్లలో రైస్‌మిల్లులో మంత్రి తనిఖీలు.. ప్యాకింగ్ సంచులు

నల్లజర్ల, అక్టోబరు 9 : పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేసి భారీస్థాయిలో రేషన్ బియ్యం సీజ్ చేయించారు. బుధవారం కొవ్వూరు మండలం కాపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి తిరిగి విజయవాడ వెళుతున్న మంత్రి మనోహర్ నల్లజర్లలోని శ్రీ వెంకట సత్య రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేశారు. పౌర సరఫరాల అధికారులు, పోలీసులు వెంట వచ్చి రేషన్ బియ్యం పరిశీలించి అక్రమంగా విదేశాలు తరలించేందుకు సిద్ధంచేసిన రేషన్ బియ్యంగా గుర్తించారు. సుమారు 50 వేల మెట్రిక్ టన్నులు ఉంటుందని, ఈ సరుకు కాకినాడ వెళ్లి అక్కడ నుంచి ఆఫ్రికా దేశాలు వెళుతున్నట్టు మంత్రి మనోహర్ చెప్పారు. పేదలకు అందాల్సిన బియ్యం ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని, ప్రభుత్వం కిలో రూ.43.40కు కొనుగోలుచేసి ఉచితంగా అందిస్తోందని, కొందరు వ్యాపారులు ప్రజల వద్ద కిలో రూ.10కు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ దందాలకు పాల్పడి అక్రమంగా కోట్లు సంపాదించారని ఆరోపించారు. రాష్ట్రంలో అక్రమ రేషన్ బియ్యం కొనుగోలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ వ్యాపారుల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బియ్యం అక్రమ రవాణా నివారించే మంచి ఆలోచనతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం అనంతపల్లిలో వెంకట సత్యనారాయణ రైస్‌మిల్లుకు వెళ్లి తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు లేవని, విచారించాలని అధికారులకు సూచించారు. అక్కడ నుంచి దేవరపల్లిలో వెంకటేశ్వరా, వరలక్ష్మి రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. వెంకటేశ్వరా రైస్‌మిల్లులో గతంలో వేరొకచోట సీజ్ చేసి తెచ్చిన 60 బస్తాలు ఉండడంతో యాజమానిని ప్రశ్నించారు. సివిల్ సప్లై అధికారులకు తీసుకుని వెళ్ల మని చెప్పినా పట్టించుకోలేదని యజమాని చెప్పడంతో అధికారులకు చివాట్లు పెట్టారు. వరలక్ష్మి రైస్‌మిల్లులో సీజ్ చేసిన బియ్యం 270 కిలోలు లేకపోవడంతో కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత రాత్రి 11 గంటల సమయంలో మంత్రి మనోహర్ అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద సరుకుతో వెళుతున్న లారీలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అక్రమ రేషన్ బియ్యం లారీలో తరలిపోతుందనే అనుమానంతో రైస్‌మిల్లులతోపాటు వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఉదయం పది గంటలకు తూర్పుగోదావరి జిల్లా కాపవరం ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన మంత్రి రాత్రి 11 గంటల వరకు రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రైస్‌మిల్లులు, వాహనాల తనిఖీలో సమయం అంతా గడిపారు. మంత్రి ఏ గ్రామం వెళ్లినా జనసైనికులతోపాటు టీడీపీ నాయకులు అంతా ఆయనతో సెల్ఫీల కోసం క్యూ కట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి మనోహర్

కొవ్వూరు, అక్టోబరు9: రైతులకు భరోసా కల్పించి అండగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుఖాతాకు సొమ్ము జమచేసి చూపిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి మనోహర్‌తో పాటు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. రైతుసేవా కేంద్రం పరిసరాల్లో మొక్కలు నాటారు. తొలుత కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి తప్పులు జరగకుండా రైతు సంఘం నుంచి ఒకరు, మిల్లర్ల నుంచి ఒకరు కలిసి క్షేత్రస్థాయి కమిటీలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. 17 శాతం నుంచి 22 శాతం వరకు తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 220 రైతు సేవా కేంద్రాల ద్వారా 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించామని, ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తోపాటు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, దిసభ్య కమిటీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

17 ఓపెన్ ర్యాంపులకు 145 దరఖాస్తులు

జేసీ ఎస్.చిన్నరాముడు

రాజమహేంద్రవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత ఇసుకను మరింతగా అందుబాటులోకి తేవడంకోసం 17 ఓపెన్ రీచ్‌లకు టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. బుధవారం సాయంత్రంతో గడువు ముగియడంతో దరఖాస్తు చేయడానికి ఇసుక వ్యాపారులు అధికంగా తరలివచ్చారు. బుధవారం రాత్రి వరకూ వీటిని స్వీకరించారు. మొత్తం 145 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. వీటిని గురువారం పరిశీలించి, జిల్లా ఇసుక కమిటీ ముందు పెట్టి, అర్హత ఉన్న వాటిని ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలో కడియం, సీతానగరం, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, తాళ్లపూడి, పెరవలి, నిడదవోలు మండలాల పరిధిలో 17 ఇసుక ఓపెన్ ర్యాంపులను గుర్తించారు. ఈనెల 16 నుంచి వీటిని అమలులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నారు. ఓపెన్ ర్యాంపులన్నీ అమలులోకి వస్తే, ఇసుక బాగా అందుబాటులోకి వస్తుంది.

కలెక్టరేట్‌లో ఇసుక టెండర్ల రగడ?

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 9: రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం ఇసుక ఓపెన్ రీచ్‌లకు సంబంధించిన టెండర్లు దాఖలు చేయడానికి వచ్చినవారు వారిలో వారు గొడవపడినట్టు తెలిసింది. టెండర్ల ప్రక్రియకు బుధవారం ఆఖరు తేదీ కావడంతో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి టెండర్ వేసేందుకు చాలామంది కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సాయంత్రం 5.55కు కొంతమంది టెండర్‌కోసం రాగా, వారితో అప్పటికే అక్కడ ఉన్నవారు గొడవ పడడంతో కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో కొంతమందికి చాన్స్ దక్కలేదు. టెండర్ల ప్రక్రియలో కొంతమంది కావాలనే టెండర్ వేసేవారిని అడ్డుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ నుంచి వచ్చిన ముగ్గురు మిగిలిన వారిని టెండర్లు వేయనివ్వలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



స్వర్ణాంధ్ర -2047 కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



సమావేశంలో మాట్లాడుతున్న పి. ప్రశాంతి, గోరంట్ల, ఆదిరెడ్డి

రేపు సాయంత్రం 7 వరకూ మద్యం దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీకి సంబంధించి షాపుల కేటాయింపునకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 11వ తేదీ సాయంత్రం 7గంటల వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. 12, 13న శాఖాపరమైన ప్రక్రియ ఉంటుందని, 14న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. బుధవారం రాత్రి 7.30గంటల సమయానికి జిల్లాలో మొత్తం 2,800 దరఖాస్తులు అందాయన్నారు. కాగా.. జిల్లాలో 125 షాపులను నోటిఫై చేయగా లక్ష్యం 3750 దరఖాస్తులు కావడం గమనార్హం. గడువు పొడిగింపుతో 12న తెరుచుకోవాల్సిన ప్రైవేటు మద్యం షాపులు 15 నుంచి అందుబాటులోకి రానున్నాయి.

రాష్ట్రంలో బ్యాంక్‌ను నెంబర్‌వన్ చేయడమే లక్ష్యం

ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా శంకర్రావు

రాజమహేంద్రవరం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను రాష్ట్రంలో నెంబర్‌వన్ చేయడమే లక్ష్యమని, గత ఐదేళ్లలో వైసీపీ ఆధ్వర్యంలో పనిచేసిన నామినేటెడ్ పాలకవర్గం బ్యాంక్‌ను దివాళా వైపు నడిపించిందని, డిపాజిట్ల సేకరణ లేదని, అప్పులు కూడా వసూలు చేయలేదని, అవకతవకలకు పాల్పడిందని ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు తెలిపారు. రాజమహేంద్రవరం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ డిపాజిట్లు రూ.1000కోట్లకు, రుణాలు రూ.750కోట్ల వరకూ ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత పాలకవర్గం నిర్వాకం వల్ల 7శాతం ఉండాల్సిన ఎన్‌పీఏను 20 శాతానికి చేసేయడంతో రిజర్వుబ్యాంక్ ఈ బ్యాంక్‌ను సూపర్‌వైజరీ యాక్షన్ ఫ్రేమ్ వర్కులో పెట్టడంవల్ల నాలుగేళ్లుగా సభ్యులకు డివిడెండ్లు ఇవ్వడం లేదన్నారు. ఈ బ్యాంక్‌ను సిక్‌అండ్‌వీక్ బ్యాంక్‌గా రిజర్వు బ్యాంక్ పరిగణించడంవల్ల జూలై 23వతేదీకి ఎన్‌పీఏ 22శాతం, నెట్ ఎన్‌పీఏ 12.84శాతంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ బ్యాంక్‌ను రిజర్వుబ్యాంక్ ఇంకా సూపర్‌వైజరీ యాక్షన్ ఫ్రేమ్‌వర్కు(శాప్)లో ఉంచిందన్నారు. కూటమి పాలకవర్గం వచ్చి 75రోజులు అయిందని, తాము లోన్లు రూ.35కోట్లకు పెంచామన్నారు. వైస్ చైర్మన్ పోలాకి పరమేష్ మాట్లాడుతూ గత పాలకవర్గంలో షాడో చైర్మన్‌గా వ్యవహరించిన ఒక వ్యక్తివల్ల బ్యాంక్ దెబ్బతిందన్నారు. డైరెక్టర్ యెనుమల రంగబాబు మాట్లాడుతూ గత నామినేటెడ్ బాడీ కొనుగోలు చేసిన గిఫ్ట్‌లోను అవినీతికి పాల్పడిందని, తప్పుడు ఆరోపణలతో బ్యాంక్ సభ్యులను మానసిక క్షోభకు గురి చేయడం తప్ప ఏమీ చేయలేదన్నారు. సమావేశంలో నీలపాల సత్యనారాయణ, పిల్లి శ్యామ్, యాళ్ల కుమార స్వామి, బుడ్డిగ రవి, పడాల శ్రీనివాస్, సింగంపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



ఇలాగైతే ఎలా.. బాస్

జిల్లాలోని పోలీసింగ్ పట్టు తప్పుతున్నట్టు కనిపిస్తోంది. బాస్ సమర్థుడే అయినా సిబ్బంది హద్దులు మీరడం.. కేసులను తారుమారు చేయడం.. గంజాయి పల్లెలకూ పాకిన దౌర్భాగ్యం వెరసి జిల్లా పోలీసు శాఖపై ఆరోపణలు అలముకుంటున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో దాష్టీకాలు జరిగినా లాఠీ బయటకు తీయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతవరకు దాడులకు ఉపక్రమించారు. కానీ కొందరు వైసీపీ అనుకూల అధికారులు కూటమి ముసుగుతో పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బదిలీల ప్రక్రియకు ఇంకా ముగింపు పలికినట్టు లేదు. ఎప్పుడు ఎవరి సీటు కదులుతుందో ఇప్పటికీ ప్రశ్నగానే ఉంది. గంజాయి గ్రామాల్లోని పుట్టినరోజు వేడుకల్లో గుప్పుమనడం ఉలికిపాటుకు గురిచేస్తోంది. కొందరు అధికారుల్లో మితిమీరిన బాసిజం, ఓ అధికారి వద్దకు వెళ్లాలంటే మహిళా పీసీలు జంకే పరిస్థితి.. కొందరు పోలీసు అధికారుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

- పోలీసుల్లో హద్దు మీరుతున్న బాసిజం
- సిబ్బందికి కొసరు పనులెక్కువ
- ఓ జోనల్ పోలీసు అధికారికి మరో జాఢ్యం
- గ్రామాల్లోని పుట్టిన రోజుల్లో గంజాయి
- కొవ్వూరు రిక్రియేషన్ క్లబ్‌పై అత్యుత్సాహం
- పెరవలి పేకాట కేసు ఏమైందో..

యూనిఫాం సర్వీసులో బాసిజానికి కొదువ ఉండదని అంటుంటారు. ఇప్పుడు జిల్లాలోని కొందరు అధికారుల తీరు చూస్తుంటే అదే నిజమనే పరిస్థితి. ఇటీవల ఓ హోంగార్డుపై జోనల్‌స్థాయి అధికారి బహిరంగంగా వర్షంలో నిలబెట్టి బండ బూతులతో రెచ్చిపోవడంతో సదరు హోంగార్డు ఆత్మహత్య చేసుకుంటానంటూ కన్నీళ్లు పెట్టుకోవడం తోటి ఉద్యోగులను కలచివేసింది. ఆ హోంగార్డు ఉద్యోగానికి సంబంధించిన నిర్లక్ష్యం అయితే పోనీలే అనుకోవచ్చు. కానీ ఆ అధికారి వ్యక్తిగత పనిలో సమాచారలోపం వల్ల జరిగిన పొరబాటుకు హద్దు మీరి చిందులు తొక్కడ శాఖలో చర్చనీయాంశమైంది. ఈ విషయం ఎస్పీకి విన్నవించడానికి వెళ్లగా హోంగార్డులకు బాధ్యత వహించే ఆర్ఐ సర్దిచెప్పి పంపేశారని తెలుస్తోంది. మహిళా సిబ్బంది విషయంలో ఆ అధికారి యూనిఫాంపై ఇప్పటికే పలు మరకలు ఉండడం గమనార్హం. విధులు నిర్వర్తించే వేళలు కూడా అందరికంటే భిన్నంగా ఉండడంతో ఆయన వద్ద పనిచేయడానికి పోలీసులు బెంబేలెత్తిపోతున్నారని సమాచారం. ఆయన ఇక్కడికి వచ్చిన ఏడాదికే ఆరుగురు డ్రైవర్లు మారారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కొసరు పనులెక్కువ

జిల్లాలోని హోంగార్డు నుంచి ఏఎస్ఐ స్థాయి వరకూ సిబ్బందికి అసలు పనులకంటే కొసరు పనులు ఎక్కువైపోయాయనే విమర్శలున్నాయి. జిల్లాలోని ఆ స్థాయిలో సుమారు 1200 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో సెలవు, సిక్ లీవ్, అనుమతుల రూపంలో ఉద్యోగానికి రాని వారిని, బందోబస్తులు, వీఐపీ బందోబస్తులు, కోర్టులు ఇలా రకరకాల రూపాల్లోని వాళ్లను తీసేస్తే ప్రతిరోజూ శాంతిభద్రతల నిర్వహణకు ఓ 600 మంది అందుబాటులో ఉంటారు. వీళ్లలో అధికారుల ఇళ్ల వద్ద, వ్యక్తిగత పనులకు 100 మంది వరకూ వెళ్లిపోతారు. మిగతావారు స్టేషన్లలోనే పనిచేస్తారా.. దర్యాప్తులే చూసుకుంటారా.. నేరస్తులనే పట్టుకుంటారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రాఫిక్ విభాగంలో సిబ్బందికంటే బీట్లే ఎక్కువగా ఉండడం గమనార్హం. ఇక హోంగార్డులు, కానిస్టేబుళ్ల దుస్థితి మరీ దారుణంగా తయారైంది. అధి కారులు ఎవరూ కూడా సిబ్బందిని వ్యక్తిగత పనులకు వినియోగించుకోడానికి వీల్లేదు. ఎస్పీ స్థాయి అధికారులకు కాస్త మినహాయింపు ఉంటుంది. అయితే డీఎస్పీ స్థాయి నుంచి సీఐ వరకూ కొందరు ఎస్ఐలు కూడా తమ వ్యక్తిగత డ్రైవర్లుగా, ఇంట్లో సరుకులు తెచ్చే వారిగా సిబ్బందిని వాడేస్తున్నారు. మహిళా హోంగార్డులను అయితే కొందరు అధికారుల ఇళ్లలో పాచి పనులు చేసే వారికంటే దారుణంగా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. అటు ట్రైనింగ్ పూర్తి చేసుకొచ్చిన యువతకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను కాకుండా కంప్యూటర్ల దగ్గర, ఆఫీస్ వర్కుకు కేటాయించడం గమనార్హం. దీనివల్ల జిల్లాలో చాలామంది పోలీసులు ఉన్నట్టు లెక్కల్లో చూపెడుతున్నా పోలీస్ విధులు నిర్వర్తించేవారు మాత్రం ఆ స్థాయిలో కానరావడం లేదు. ఇదే అంశంపై ఇటీవల హోంమంత్రి వంగలపూడి అనిత నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో కూడా చర్చకు వచ్చింది.

అత్యుత్సాహమేనా!

పలువురు పోలీసుల అత్యుత్సాహం శాఖకు చెడ్డ పేరు తీసుకొచ్చేవిధంగా ఉంటోందని అంటున్నారు. కొవ్వూరు రిక్రియేషన్ క్లబ్ సంఘటనే తాజా ఉదాహరణ. పోలీసులు రాత్రివేళ ఆ క్లబ్‌పై దాడి చేశారు. అప్పటికే అక్కడ పేకాట ఆడుతున్న సుమారు 30 మంది పోలీసుల హడావుడి చూసి కంగారు పడిపోయారు. దొరికిన దారిలో పారిపోయే ప్రయత్నంలో మొదటి అంతస్తు నుంచి కిందికి పడిపోయారు. ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో వీధిలో పేకాట శిబిరం, రోడ్డుకో బెల్టుషాపు, బ్లేడ్ బ్యాచ్‌ల హల్‌చల్ వంటివి ఉన్నా ఎందుకనో దాడులు గుర్తుకు రాలేదు. పైగా కొవ్వూరులో దాడి చేసింది పేకాట శిబిరంపై కాదు. క్లబ్‌పై దాడి చేసే ముందు అనుమతులను పరిశీలించి నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాల్సి ఉండాల్సిందనే అభిప్రాయం ఉంది. అప్పటికీ శ్రుతి మించితే కఠిన చర్యలు తీసుకోవడం సబబే. కానీ క్లబ్‌ని అనుమతుల మేరకే నిర్వహిస్తున్నామని, సీసీ కెమెరాలను ఏర్పాటుచేశామని నిర్వాహకులు చెప్పినా వినలేదని సమాచారం. ఇదే సబ్ డివిజన్ పరిధిలోని నిడదవోలు పోలీస్‌స్టేషను పరిధిలోకి వచ్చే పెరవలి మండలం ముక్కామలలో గత నెల 8న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన సమయంలో సుమారు 30 మందిని, రూ.8 లక్షలు స్వాధీనం చేసుకొని చివరికి రూ.6 లక్షలు తప్పించి, 25 మందిని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించినట్టు తెలిసింది.

బదిలీలకు ముగింపు లేదా?

జిల్లాలోని కిందిస్థాయి సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్ ఇటీవల బదిలీ చేశారు. కానీ సీఐల బదిలీల తంతు మాత్రం అంతం కాదిది.. ఆరంభం అనే చందంగా సాగుతోంది. వైసీపీకి అనుకూలమైన వాళ్లు సందేట్లో సడేమియా మాదిరిగా మళ్లీ మంచి పోస్టింగులు దక్కించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆ ప్రభుత్వంలో వివక్షకు గురైన వారికి ఈ ప్రభుత్వంలోనూ మేలు జరగలేదనే ఆవేదన కొందరిలో ఉంది. వైసీపీ దాష్టీకాలకు తలవంచలేక లాప్‌లైనులో చేసిన వారిని మళ్లీ లూప్ లైనుకు లేదా వీఆర్‌కి పంపించారు. జిల్లా వీఆర్‌లో ఉన్న సిబ్బందిని ఎప్పుడు ఏ స్టేషనుకు పంపిస్తారో.. ఎవరిని ఎప్పుడు వీఆర్‌లో పెడతారో తెలియని పరిస్థితి నడుస్తోంది. ట్రై చేసుకుంటే ఏ సీటు అయినా సాధ్యమే అనే చందంగా రోజులు గడుస్తున్నాయి. దీంతో డబ్బు ఖర్చు పెట్టుకుని పోస్టింగులు పట్టుకున్న వాళ్లకూ సీటు గ్యారంటీ లేదు. మరోవైపు అనపర్తి సీఐ శివగణేశ్‌ని అకస్మాత్తుగా వీఆర్‌కి పంపించారు. ఆయన స్థానంలో సంపత్ హుటాహుటిన వచ్చి జాయిన్ అయిపోయారు. ఈయన గతంలో ఇదే స్టేషనులో ఎస్ఐగా విధులు నిర్వర్తించిన అనుభవం ఉంది. దాంతో స్థానిక పరిచయాలే ఆయనకు లాభించినట్టు సమాచారం. గతంలో తీవ్ర ఆరోపణలు ఉన్న అధికారులను జిల్లా లేదా రేంజ్ వీఆర్‌లో పెట్టడం జరిగేది. కానీ ఇప్పుడు చిటికెలో వీఆర్‌లో పెడుతున్నారు. దీంతో సామాన్యుల భద్రతకు ఆయా అధికారులు ఎంత వరకూ భరోసా కల్పిస్తారో.. శాంతి భద్రతలను ఏ మేరకు కాపాడతారో వేచి చూడాల్సిందేననే వాదన నడుస్తోంది.

గంజాయి కలకలం

గంజాయిని ఉక్కుపాదంతో నిర్మూలిస్తామని కూటమి పాలకులు చెబుతుంటే జిల్లాలో పరిస్థితి మాత్రం ఆ మాటలను వెక్కిరిస్తున్నట్టు కనిపిస్తోంది. గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలను ఏకంగా ఒక టాస్క్‌ఫోర్స్‌ని అందుబాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పింది. దానికి బాస్‌ని కూడా నియమించింది. అయితే సిటీల్లోని బర్త్‌డే వంటి పార్టీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగడం వింటూనే ఉంటాం. కానీ ఇప్పుడు చిన్న గ్రామంలోని జన్మదిన వేడుకల్లో కుర్రాళ్లు గంజాయితో ఎంజాయ్ చేశారనే వార్త స్థానికంగా చర్చనీయాంశమైంది. భూపాలపట్నం గ్రామంలో పుట్టినరోజు వేడుకల్లో యువకులు డ్రగ్స్ సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు వెంటనే వెళ్లారు. కారులో కొందరు గంజాయి కొడుతుండడం గుర్తించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర @2047

- పేదరికాన్ని పారద్రోలేలా ప్రణాళికలు సిద్ధంకావాలి
- 2047 ప్రణాళికతోపాటు 2024-2029 జిల్లా విజన్ ప్లాన్ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు9: ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర@2047 ప్రణాళికలు రూపకల్పన చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో బుధవారం వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర@2047, 2024-25 టూ 2028-2029 జిల్లా విజన్ ప్లాన్‌పై ప్రముఖుల సలహాలు, సూచనలకోసం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దీనికి మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం రూరల్, సిటీ, రాజానగరం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ దేశ, రాష్ట్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించేటప్పుడు క్షేత్రస్థాయి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఆ దిశగా వివిధ రంగాలకు సంబంధించి దేశస్థాయిలో వికసిత్ భారత్, రాష్ట్రస్థాయిలో స్వర్ణాంధ్ర@2047 రూపకల్పనకు అవసరమైన ప్రణాళికలను రూపొందించే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర @2047 పేరుతో నవంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా విజన్‌పత్రం రూపకల్పన దిశగా క్షేత్రస్థాయిలో పరిగణలోకి తీసుకున్న అంశాలపై జిల్లా స్థాయిలో సమీక్షించి రాష్ట్రానికి పంపడం జరుగుతుందన్నారు. విజనరీ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని, ఆయన విజన్-2020 రూపకల్పన చేసి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వం ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, గత గ్రామసభల్లో క్షేత్రస్థాయిలో నిర్ణయించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టడం జరుగుతుందన్నారు. 2047నాటికి 15 శాతం వృద్ధిరేటు సాధించాలన్నారు. రానున్న ఐదేళ్లలో ఏయే అంశాలపై లక్ష్యసాధన చేయాలనేది ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధంచేయాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర@2047 విధి విధానాల మేరకు మండలస్థాయిలో కార్యక్రమాలను క్రోడీకరించుకొని జిల్లాస్థాయిలో ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. సహజ వనరులను, మానవ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలు అభివృద్ధి లక్ష్యంగా అన్ని రంగాల్లో క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం కావాలన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్య, వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తమ సలహాలు ఇచ్చారు.

భూపాలపట్నంలో డ్రగ్స్ కలకలం



భూపాలపట్నంలో పార్టీ జరిగిన గెస్ట్‌హౌస్

రాజానగరం, అక్టోబరు 9: తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నం సమీపంలోని ఓ గెస్ట్‌హౌస్‌లో పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని కొంతమంది యువకులు డ్రగ్స్ సేవిస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తాడేపల్లిగూడెం, హైదరాబాద్, వైజాగ్ ప్రాంతాలకు చెందిన కొంతమంది యువకులు ఈనెల 7వ తేదీ రాత్రి ఈ గెస్ట్‌హౌస్‌లో పుట్టినరోజు వేడుకల్లో మాదక ద్రవ్యాలు సేవిస్తున్నారన్న సమాచార అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, అనుమానిత యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టుగా తెలిసింది. దీనిలో ప్రధానంగా తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడు గత కొంతకాలంగా దివాన్ చెరువులో నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి మారుమూల ప్రాంతమైన భూపాలపట్నం శివారులోని ఒక గెస్ట్‌హౌస్‌ను ఎంచుకుని పుట్టినరోజు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. దీనిలో భాగంగా అధిక సంఖ్యలో యువత పాల్గొని పబ్ సంస్కృతిని తలపించేలా ఏర్పాట్లలో మునిగితేలినట్టు సమాచారం. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. దీంతో పలువురు యువకులు, యువతులు అక్కడి నుంచి పరుగులు తీయగా, వీరిలో ముగ్గురు యువకులు మాత్రం పోలీసులకు చిక్కారు. వీరిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వీరు వచ్చిన కారును తనిఖీ చేయగా కారులో కొకెయిన్, గంజాయి పొట్లాలు తదితర మాదక ద్రవ్యాలు లభించినట్టు తెలిసింది. నిందితుల నుంచి పూర్తి వివరాలు రాబట్టేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.